RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 11 బుధవారం 5 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

## కలవరపెడుతున్న 'జీబీఎస్' వైరస్..

చెన్నై: జీబీఎస్ అనే కొత్త వైరస్ బారిన పడి తొమ్మిదేళ్ల బాలుడు మృతిచెందడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దేశంలో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాళ్ రాష్ట్రాల అనంతరం, జీబీఎస్ అనే కొత్త రకం వైరస్ రాష్ట్రంలో వెలుగు చూసింది. తిరువళ్లూరు సమీపంలోని తిరువూరు ఎంజీఆర్ నగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ కుమారుడైన వైదీశ్వరన్ (9) అదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆదిద్రావిడుల సంక్షేమ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గత నెల 22వ తేదీ ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరగా వైదీశ్వరన్ కాళ్లు కదపలేక ఇబ్బందుల పాలయ్యాడు.

దీంతో ఆ బాలుడిని తన తల్లిదండ్రులు వేపంపట్టు ప్రాంతంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లగా, వైద్యపరీక్షలు చేసి, మందులిచ్చారు. ఇంటికెళ్లిన బాలుడు నడవకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.




# కుల గణన ఆధారంగానే పంచాయితీ ఎన్నికల్లో సీట్లు!

## స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: దేశ చరిత్రలోనే.. తెలంగాణ రాష్ట్రంలో చేసిన కులగణనే అధికారిక సర్వే అని.. దేశానికే ఇది రోల్ మోడల్ అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. రాబోయే పంచాయితీ ఎన్నికల్లో కులగణన ఆధారంగా సీట్లు ఇస్తాం అని.. అధికారికంగా కులగణన అమలు చేసే బాధ్యత బీసీ కమిషన్ దే అని స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. అసెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారాయన. దేశంలోనే మొదటి సారి కుల గణన చేసి చరిత్ర సృష్టించామని.. పకడ్బందీగా సర్వే నిర్వహించి వివరాలు సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2025, ఫిబ్రవరి 4వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి విలేఖర్లతో చిట్ చాట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో విజయవంతంగా కుల గణన కంప్లీట్ చేయడంతో.. ఇక దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని ప్రధాని మోడీపైన ఒత్తిడి పెరుగుతోందన్నారు. అన్ని రాష్ట్రాల్లో కుల గణన చేయాలనే డిమాండ్ మరింత ఎక్కువ అవుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో బీసీ, ఎస్సీ మైనార్టీలకు న్యాయం జరగనుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా కుల గణన, ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ నుంచి రోడ్ మ్యాప్ ఇస్తున్నామని.. భవిష్యత్‌లో తెలంగాణ డాక్యుమెంట్స్‌ను రెఫరెన్స్‌గా తీసుకోవాలని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల తర్వాత మళ్లీ మా కాంగ్రెస్ ప్రభుత్వమే కుల గణన చేపట్టిందన్నారు. 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు ఎక్కడ ఉన్నాయో చేసిన వాళ్లే చెప్పాలన్నారు. కుల గణన రిపోర్టు, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు కేబినెట్, అసెంబ్లీలో ఆమోద ముద్ర పడటంతో.. ఈ రోజు (ఫిబ్రవరి 4) దేశం చరిత్రలో నిలిచిపోతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే కాపీ చట్టం కాలేదని.. అసలు సర్వే ఎవరు చేశారో ఎందుకు చేశారో ఎవ్వరికీ చెప్పలేదన్నారు. ప్రభుత్వ అధికారికంగా సర్వే చేస్తే.. ఆ వివరాలు బయటపెట్టాలన్నారు.

దేశ చరిత్రలో మేము చేసింది అధికారిక సర్వే అని అన్నారు. కులగణన నివేదికకు క్యాబినెట్‌ఆమోదం తెలిపిందని.. ఈ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెడతామని తెలిపారు. కుల గణనపై ప్రభుత్వం సభలో ప్రకటన చేస్తుందని క్లారిటీ ఇచ్చారు. కుల గణన నివేదికపై చర్చ?కు స్పీకర్ అవకాశం ఇస్తే సభలో చర్చ జరుగుతుందన్నారు.

**ఫిబ్రవరి 4.. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుంటుంది: సీఎం రేవంత్‌రెడ్డి...** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోర్టు తీర్పు అమలు కోసం ఏకసభ్య కమిషన్ వేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. "వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసింది. కమిషన్ పలు జిల్లాల్లో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించింది. నేరుగా ప్రజలను కలుసుకుని విజ్ఞప్తులు సేకరించింది.

మరికొందరు కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా విజ్ఞప్తులు అందించారు. 82 రోజుల్లో కమిషన్ తన నివేదికను అందించింది. 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను 3 గ్రూపులకు పంచుతూ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలను గ్రూప్-1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సిఫారసు చేసింది. గ్రూప్-1లోని 15 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్ (జనాభా 3.288 శాతం), గ్రూప్-2లోని 18 ఎస్సీ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్ (జనాభా 62.74 శాతం), గ్రూప్-3లోని 26 ఉప కులాలకు 5శాతం రిజర్వేషన్ (జనాభా 33.963శాతం) కల్పించాలని వర్గీకరణ కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఎస్సీ కులాల గ్రూప్‌లకు రోస్టర్ పాయింట్లు, క్రిమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ వర్గీకరణ, కులగణన.. నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశాలు.

ఫిబ్రవరి 4, 2025.. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి పోతుంది. ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. చాలా రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి తప్ప.. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదు.

అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించాం. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నా" అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కుంభమేళాకు ప్రధాని మోదీ.. పవిత్ర స్నానంతోపాటు ప్రత్యేక పూజలు




ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 5న ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాను సందర్శించనున్నారు. ప్రతిపాదిత షెడ్యూల్ ప్రకారం మోదీ ఉదయం 10:30 గంటలకు ఫిబ్రవరి 5న ప్రయాగరా జ్‌కు చేరుకుంటారు. ఆ క్రమంలో ప్రధాని మహాకుంభమేళాను సందర్శించే సమయంలో ప్రత్యేక పూజలతోపాటు పవిత్ర స్నానం చేయనున్నారని తెలుస్తోంది. ఆయన ప్రయాగరాజ్‌లోని అరయిల్ ఘాట్‌కు చేరుకుని, అక్కడి నుంచి గంగా, యమునా, సరస్వతి నదుల సంగమ స్థలమైన సంగం వద్ద పడవ ప్రయాణం చేస్తారు. ఆ క్రమంలో అక్కడి పవిత్ర సంగమ నదుల్లో ఆయన పవిత్ర స్నానం చేయనున్నారు.

**స్నానం తర్వాత మోదీ..** మోదీ ఆ తర్వాత, భక్తులతో సంభాషించడం, ఆయా ప్రాంతాలలో పర్యవేక్షణ నిర్వహించడం, 2025 మహాకుంభ్ కోసం నిర్వహించిన ఏర్పాట్లను పరిశీలించడం వంటి కార్యక్రమాలలో పాల్గొంటారు. మేళా అధికారులు వివరించినట్లుగా, ముందుగా నిర్ణ యించబడిన షెడ్యూల్ ప్రకారం ముఖ్యంగా స్టేట్ పెవిలియన్, నేత్ర కుంభ్ సందర్శనలో మార్పులు చేశామని అధికారులు ప్రకటించారు. దీంతో ఆయనకు కుంభమేళా ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని ఇవ్వనుంది.

**ఫిబ్రవరి 5న ఏంటి స్పెషల్..** ఫిబ్రవరి 5 ఒక ప్రత్యేకమైన రోజు. ఎందుకంటే ఇది మాఘ అష్టమి, భీష్మ అష్టమి వచ్చిన రోజు. ఈరోజుకు హిందూ సంప్రదాయంలో ఆధ్యాత్మిక విశేషత కలిగి ఉంది. మాఘ అష్టమి హిందూ మాఘ మాసం ఎనిమిదో రోజున జరుపుకునే పవిత్రమైన రోజు. ఈ రోజున భక్తులు త్రివేణి సంగమ స్థలంలో (ప్రయాగరాజ్) పవిత్ర స్నానాలు చేస్తారు. ఆ క్రమంలో ఆధ్యాత్మిక సాధనలు, పూజలు, ధ్యానాలు, దాన ధర్మాలు నిర్వహించబడతాయి. ఇది గుప్త నవరాత్రి సమయంలో కూడా వస్తుంది.

**ఆధ్యాత్మిక సంప్రదాయాలలో...** దీనిని హిందూ ఆధ్యాత్మిక సంప్రదాయాలలో అత్యంత పవిత్రమైన కాలంగా పరిగణిస్తారు. ఇది మహాభారతం నుంచి గౌరవనీయ యోధుడు భీష్మ పితామహుని సంస్మరించుకునే రోజు. పురాణాల ప్రకారం, భీష్ముడు తన బాణాల మంచంలో పడుకున్న సమయంలో, సూర్యుడు ఉత్తరాయణం ప్రారంభం, శుక్ల పక్షం మొదలయిన తర్వాతే, తన మరణ సమయాన్ని ఎంచుకున్నాడు. ఆ క్రమంలో ఆయన ఆత్మత్యాగం, ధర్మం భారతీయ సంస్కృతిలో మరింత ప్రాముఖ్యాన్ని పొందాయి.

**12 ఏళ్లకు ఒకసారి..** దీంతో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే మహాకుంభమేళా గొప్ప మతపరమైన ఉత్సవంగా నిలుస్తోంది. ఇది ఆధ్యాత్మిక దృష్టిలో అత్యంత పవిత్రమైన వేడుకగా భక్తులు భావిస్తున్నారు.

దీంతో భారతీయుల కోసం ఇది ఒక సమ్మిళిత వేదికగా నిలిచిపోతుంది. ఈ సమయంలో లక్షలాది మంది భక్తులు, యాత్రికులు తమ మతపరమైన విధానాలను కొనసాగించడానికి ఆయా ప్రాంతాలకు వచ్చి సంగమ స్థలంలో పవిత్ర స్నానం చేస్తున్నారు.




హైదరాబాద్ : తెలంగాణలో సామాజిక,ఆర్థిక కులగణన సర్వేకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేసింది. రేవంత్ తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. కులగణనపై తీర్మానం సందర్భంగా అసెంబ్లీలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ధీటుగా కౌంటర్ ఇచ్చాయి. సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ మాజీ మంత్రి కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. కులగణన లెక్కలో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపించారని కేటీఆర్ అన్నారు. 2014 లో సమగ్ర సర్వే వివరాలు వెబ్ సైట్లో పెట్టామని చెప్పారు . వెబ్ సైట్లో ఉన్న రిపోర్ట్.. ఆరోజు చేసిన సమగ్ర కుటుంబ సర్వేనే అని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 51 శాతం. ముస్లిం బీసీలు 10 శాతం కలిపితే ఆనాటి మొత్తం బీసీలు 61 శాతం. 5 శాతం బీసీలను తగ్గించారు. మీ ప్రభుత్వం మీద నమ్మకం లేదు. ప్రత్యేక మైన బిల్లు తీసుకొస్తారని మేము ఆశించాం. కుటుంబ సర్వేచేసినప్పుడు రేవంత్ పాల్గొన్నారా?. 56 శాత ఉన్న బీసీలకు సబ్ ప్లాన్ తెస్తారని ఆశించాం అని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వేను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ కోసం చేశారని ఫైర్ అయ్యారు. ఆనాడు సర్వేను ఊరు పేరు తెలియన వాళ్లతో చేయించారు. సర్వే రిపోర్ట్ పై ఎందుకు ఆనాడు కేబినెట్ లో చర్చించలేదు..అసెంబ్లీలో పెట్టలేదు. అర్థం పర్థం లేని మాటలతో ప్రయోజనం లేదు. కులగణన సర్వేలో పాల్గొనలేని కేటీఆర్ కు మాట్లాడే హక్కు లేదు. వాళ్లకు మైక్ ఇవ్వొద్దు..సభలో మాట్లాడే అర్హత లేదు. వీళ్లు చూపిస్తున్న రిపోర్ట్ ప్రభుత్వ వెబ్ సైట్ లో లేదు. ఆనాడు సర్వే చేసిన ఎనామ్యలేటర్లు ఎవరు?. ఒక్కరోజులోనే రాష్ట్ర మొత్తాన్ని లెక్కించారా?. సమగ్ర సర్వేను వాళ్ల రాజకీయం కోసం వాడుకుంటున్నారు. లేని పోని విమర్శలతో ఉపయోగం లేదని కౌంటర్ ఇచ్చారు రేవంత్.




# ఢిల్లీ బాద్‌షా ఎవరో?

## మూడు పార్టీల హోరాహోరీ

## మరోసారి అధికారం కోసం ఆప్ గట్టి పోటీని ఇస్తున్న కమలం పార్టీ గత వైభవానికి కాంగ్రెస్ పోరాటం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల ప్రచారపర్వం నిన్నటితో ముగిసింది. రేపు పోలింగ్ జరగనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం మూడు పార్టీలు తీరిక లేకుండా ప్రచారం చేశాయి. పుష్కరకాలంగా ఢిల్లీని ఏలుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ మరోసారి అధికారం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతూ అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడుతున్న బీజేపీ ఈసారి ఆప్‌ను గద్దె దింపేందుకు గట్టిగానే కష్టపడుతున్నది. గత మూడు ఎన్నికల్లో ఓటముల తర్వాత ప్రభావాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఈసారి గత వైభవాన్ని పొందేందుకు శ్రమిస్తున్నది. దీంతో మూడు పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొన్నది. దేశ రాజధాని కావడంతో ఢిల్లీ ఫలితాలు దేశ రాజకీయాల్లోనూ కీలకంగా మారనున్నాయి.

**కేజ్రీవాల్‌పై విశ్వాసం కొనసాగుతుందా?...** 2013 నుంచి ఢిల్లీ ఓటర్లు లోక్‌సభ ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ అసెంబ్లీకి వచ్చే సరికి కేజ్రీవాల్‌కే సీఎం కుర్చీని కట్టబెడుతున్నారు. ముఖ్యంగా ముస్లిం, దళిత, సిక్కు ఓటర్లలో, మురికివాడల్లో కేజ్రీవాల్‌కు ఆదరణ ఉన్నది. అయితే, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, నేతల అరెస్టులు, వలసలు, నగరంలో వాయు, నీటి కాలుష్యం, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు ఈసారి ఆమ్ ఆద్మీకి మైనస్‌గా మారాయి.

**27 ఏండ్ల తర్వాతైనా కమలం వికసించేనా?..** ఢిల్లీలో 1998 నుంచి బీజేపీ అధికారానికి దూరంగా ఉంది. ఈసారి కచ్చితంగా విజయం సాధించాలనే పట్టుదలతో బీజేపీ ఉంది. ఇందుకోసం అన్ని అస్త్రాలనూ ఉపయోగిస్తున్నది. గతంలో విమర్శించిన ఆప్, కాంగ్రెస్ నేతలను పార్టీలో చేర్చుకొని టికెట్లు ఇచ్చింది. ఉచితాలకు వ్యతిరేకం అంటూనే ఢిల్లీలో భారీగా హామీలు ప్రకటించింది.

**కాంగ్రెస్ ప్రభావమెంత?...** 2013 నుంచి ఢిల్లీలో కాంగ్రెస్ క్రమంగా ప్రభావాన్ని కోల్పోయింది. పోయిన వైభవాన్ని తిరిగి పొందేందుకు ఈసారి కాంగ్రెస్ గట్టిగానే ప్రయత్నిస్తున్నది. కొన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులను పోటీలో దింపింది.

**ఈ సారి ఫలితం వన్‌సైడ్ కాదా?...** ఈసారి ఫలితాలు భిన్నంగా ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత రెండు ఎన్నికలల్లో కనిపించిన ఏకపక్ష ఫలితాలు ఈసారి ఉండకపోవచ్చని చెప్తున్నారు. కాంగ్రెస్ సాధించే ఓట్లను బట్టి ఆప్, బీజేపీ గెలుపోటములు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ముస్లిం, దళితులు గణనీయంగా ఉన్న 12 స్థానాల్లో ఆప్-కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్టు చెప్తున్నారు.

మిగతా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పొందేవి ఆప్ సంప్రదాయ ఓట్లనా? ప్రభుత్వ వ్యతిరేక ఓట్లనా అనేది ఫలితాలను నిర్ణయించడంలో కీలకమని అంచనా వేస్తున్నారు.

# సంపాదకీయం

## కర్నాటకలో సీఎం కుర్చీ కోసం ఆట మొదలైంది !

దక్షిణాదిన కర్నాటకలో రెండేళ్ళ క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అలా బోణీ కొట్టి ఆ ప్రభావంతో తెలంగాణాలోనూ జెండా ఎగరేసింది. ఏడున్నర పదుల వయసు ఉన్న సిద్ధరామయ్యను కాంగ్రెస్ అధినాయకత్వం ముఖ్యమంత్రిగా చేసింది. అయితే ఆనాడు కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ గా డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి కోసం చివరి దాకా పోటీ పడ్డారు. అయితే అధికారం చెరి సగం కాలానికి అని ఒక తెర వెనక ఒప్పందం కుదిరింది అన్న ప్రచారం కూడా సాగింది. ఇక చూస్తే శివకుమార్ కి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి కీలక శాఖలతో సమానమైన ప్రాధాన్యతను కల్పించారు. అయితే సిద్ధరామయ్య పదవీ కాలం ఈ నవంబర్ నాటికి రెండున్నరేళ్ళు పూర్తి అవుతుంది. దాంతో ఆ పదవిని డీకే శివకుమార్ కి ఇస్తారు అని ఆయన వర్గీయుల ప్రచారం జోరందుకుంది. మరో వైపు డీకే వ్యతిరేక వర్గాలు కూడా కాంగ్రెస్ లో హడావుడి చేస్తున్నాయి. సిద్ధరామయ్యకు అనుకూలంగా ఉండే కొందరు మంత్రులు అయితే సిద్ధరామయ్య విషయంలో కాంగ్రెస్ అధినాయకత్వానికి ఫిర్యాదు చేయడానికి సిద్ధపడుతున్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉండకుండా తమ శాఖలలో జోక్యం చేసుకుంటున్నారు అని వారు ఆరోపిస్తున్నారు. అంతటితో ఆగకుండా పీసీసీ చీఫ్ ఉప ముఖ్యమంత్రి ఒక్కరే సరిగ్గా నిర్వహించలేరని అందువల్ల ఆ పదవిని ఆయనకు కాకుండా వేరే వారికి ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. ఇక డీకే అనుకూలురు ఒక వర్గంగా ఉంటే వ్యతిరేకులు మరో వర్గంగా ఉన్నారు. డీకే వ్యతిరేక వర్గానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పరోక్షంగా మద్దతు ఇస్తున్నారు అని కూడా ప్రచారం సాగుతోంది. వరసబెట్టి డీకే వ్యతిరేకులు జరుపుతున్న విందు రాజకీయాలకు సిద్ధరామయ్య మద్దతు ఉందని డీకే వర్గీయులు అనుమానిస్తున్నారు. మొత్తం మీద చూస్తే కాంగ్రెస్ లో సీఎం కుర్చీలాట మొదలైంది అని అంటున్నారు. ఇక దానితో పాటుగా పీసీసీ చీఫ్ పదవి విషయంలోనూ పోటీ స్టార్ట్ చేశారు. ఆ పదవి మీద సహకార మంత్రి రాజణ్ణ, మరో మంత్రి సతీష్ జార్జి హెూళీ కూడా కన్నేసి తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. ముందు పీసీసీ పీఠం అందుకుంటే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావచ్చు అన్నది వీరి ముందస్తు ఆలోచనగా చెబుతున్నారు. ఇక లేటెస్ట్ డెవలప్మెంట్ ఏంటి అంటే కర్ణాటకు తదుపరి సీఎం గా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడతారని ఆయన వర్గీయుడు అయిన హెచ్ సీ బాలక్రిష్ణ సంచలన వ్యాఖ్యలను చేశారు. సిద్ధరామయ్యతో సరిసమానంగా డీకే పార్టీని అధికారంలోకి తీసుకుని రావడానికి తన వంతుగా ఎంతో కృషి చేశారు అని ఆయన గుర్తు చేస్తున్నారు. ఆయన ఆయన రామనగర్ జిల్లా చెన్నపట్నంలో నిర్వహించిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేసి పార్టీలో ప్రభుత్వంలో చిచ్చు రాజేశారు అని అంటున్నారు. అయితే దీని మీద డీకే మీద తాము ఫిర్యాదు చేయబోతున్నట్లుగా మంత్రి రాజణ్ణ ప్రకటించడం విశేషం. మరో వైపు ముఖ్యమంత్రి పదవి మీద డీకేకి పోటీగా మరి కొందరు తమ పేర్లను ముందు పెట్టి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పరమేశ్వర్, జార్జి హెూళీ, మహాదేవప్ప తదితర కాంగ్రెస్ నేతలు విందు సమావేశాలు ఏర్పాటు చేయడం వెనక సీఎం పీఠం మీద గురి ఉందని అంటున్నారు. ఈ తరహా విందు సమావేశాలలో ఒకదానికి సీఎం హెూదాలో సిద్ధరామయ్య కూడా హాజరై వారికి మద్దతుగా నిలవడం కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో సరికొత్త మలుపు అంటున్నారు విందు సమావేశాలు నిర్వహించడంలో తప్పు ఏముందని ఆయన అంటున్నారు. ఇక డీకేకి వ్యతిరేకంగా దళిత సీఎం అన్న నినాదాన్ని కోరి వ్యతిరేక వర్గీయులు తీసుకుని వస్తున్నారు అని డీకే వర్గీయులు అంటున్నారు. మరో వైపు చూస్తే పర్యాటక శాఖ మంత్రి హెచ్ కే పాటిల్ కర్ణాటక తదుపరి సీఎం అని గదగలో ఇమ్మడి సిద్ధరామేశ్వరస్వామి జోస్యం చెప్పడంతో కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. కాంగ్రెస్ రాజకీయం ఇలా ఉంటే సిద్ధరాయ మీద ముడా కుంభకోణతో టార్గెట్ చేసిన ఆ రాష్ట్ర బీజేపీ ఇపుడు ఇరకాటంలో పడిపోయింది. ఈ కుంభకోణంలో సీఎం ఆయన కుటుంబ సభ్యుల పాత్ర లేదని లోకాయుక్త రిపోర్టు ఇవ్వడంతో కమలం ఖంగు తింది. ఇక కమల రాజకీయాలు సైతం కర్ణాటకలో ఏమంతా బాగా లేవు. మాజీ సీఎం యడ్యూరప్ప ఆయన వ్యతిరేక వర్గంగా సాగుతున్నాయి. కర్ణాటక బీజేపీ అధ్యక్ష పీఠం కాపాడుకునేందుకు బీవై విజయేంద్ర తన ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు యడ్యూరప్పను ఆయన అనుచరులను దూరం చేస్తే బీజేపీకి నష్టమని ఆయన వర్గీయుడు అయిన ఎంపీ రేణుకాచార్య అంటున్నారు. అలాగే జనతాదళ్ ఎస్ లో రాష్ట్ర అధ్యక్ష పదవి యువనే త నిఖిల్ గౌడకు జాతీయ అధ్యక్ష పదవిని కేంద్ర మంత్రి కుమారస్వామికి అప్పగించాలని ఆ పార్టీ అధినాయకుడు దేవేగౌడ ప్రయత్నాలు చూస్తున్నారు. మొత్తానికి కర్ణాటకలో అన్ని పార్టీలలో రాజకీయం రసకందాయంలో ఉంది.

## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బిజెపి నాయకులు




శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ రాష్ట్రానికి న్యాయమైన బడ్జెట్ ను కేటాయించినందుకు గాను ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాలాభిషేకం నిర్వహించారు. మంగళవారం శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తాలో మండల బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి, రోడ్డు భవన నిర్మాణాలకు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడి, కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మాళసీతారామన్ తగిన బడ్జెట్ ను కేటాయించి న్యాయం చేశారన్నారు. ఇప్పటివరకు ఎంతో అభివృద్ధి చేశారని, ముందు ముందు మరింత అభివృద్ధి చేస్తారని వారు దీన్ని అర్థం చేశారు. నరేంద్ర మోడీకి, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కు బీజేపీ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, బిజెపి నాయకులు విక్రమ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సుధాకర్ నాయక్, బిజెపి మండల అధ్యక్షుడు కొర్వి కృష్ణ, శ్రీనివాస్, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన



శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన కల్పిం చారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం శామీర్ పేట లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (జగద్గిరిగుట్ట) లో క్యాన్సర్ పై అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి పోస్టర్ ప్రజెంటేషన్ తో పాటు వివిధ రకాల క్యాన్సర్లుపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం, వచ్చిన ముందుగానే గుర్తించి సరైన రీతిలో వైద్యం ఎలా తీసుకోవాలి అనే విషయంపై విద్యార్థినిలకు అర్థమయ్యే రీతిలో అవగాహన నిర్వహించారు. ఇందులో భాగంగానే పోస్టర్ ప్రజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీంతో స్పందించిన కొంతమంది విద్యార్థినులు ముందుకు వచ్చి వారి కుటుంబంలో జరిగిన క్యాన్సర్ కు సంబంధించి అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చేతన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## దృష్టికి వస్తేనే చర్యలు!



మల్యాల : కొండగట్టు అంజన్న ఆలయ భూములు ఎక్కడెక్కడున్నాయో అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి కొందరు వ్యక్తులు భూములను సాగు చేసుకుంటున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొండగట్టు దిగువ ప్రాంతంలో ఆలయ భూముల్లో భవన నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి. ముత్యంపేట పరిధిలోని కొండగట్టు అంజన్న పేరిట మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో 649 ఎకరాల విలువైన భూములున్నాయి. వాటిలో అత్యధికంగా మల్యాల మండలంలోనే ఉన్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల కిందట కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లోని గుట్టల ప్రాంతాల్లో 333 ఎకరాల విస్తీర్ణంలోని రెవెన్యూ భూములను అప్పటి కలెక్టరు శరత్ ఆలయ అధికారులకు స్వాధీనం చేశారు. సదరు భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించని కారణంగా ఆ భూములు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది.

గతంలో పలువురు భూస్వాములు, దాతలు స్వామివారి దూపదీప నైవేద్యం కోసం విలువైన భూములను అందజేశారు. ఆ వివరాలు ఆలయంలోని 43 రిజిస్టరులో నమోదై ఉన్నప్పటికీ ఆ భూములు ఎక్కడున్నాయో తెలియకపోవడంతో వాటిని కొందరు వ్యక్తులు ఏళ్ల తరబడి ఆక్రమించుకొని సేద్యం చేసుకొంటున్నారు. దీనిపై గతంలో కథనం ప్రచురితం కాగా దాదాపు ఏడేళ్ల కిందట అప్పటి ఈవో స్పందించి ఆక్రమణలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అధికారులు కొండగట్టు దిగువ ప్రాంతంలోని ఆలయ భూమిలో ఆక్రమణలపై చర్యలు చేపట్టకపోవడంతో పలు నిర్మాణాలు జరిగాయి. రాంసాగర్ శివారులో ఆలయ భూమి ఆక్రమణకు గురైనట్లు సమాచారం. కొండగట్టు గుట్టల మధ్యగల సంతొల్లలొద్ది చెక్‌డ్యాం కింది ప్రాంతంలోని దాదాపు రూ.1.50 కోట్ల విలువైన 3 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని(ప్రస్తుతం ఆలయ భూమి) మల్యాల మండల కేంద్రానికి చెందిన ఓ హెూటల్ యజమాని ఆక్రమించుకొని దాని చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకుని 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారంటే అధికారుల పర్యవేక్షణ ఏవిధంగా ఉందో అర్థం అవుతుంది. ఇటీవల గిరిప్రదక్షిణ రహదారి నిర్మాణ సమయంలో ఆలయ భూమి ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. గతంలో ముత్యంపేట శివారులోని తుమ్మల చెరువు, పీచుకుంట, మారుతిటౌన్‌షిప్ ముందు ఆలయానికి చెందిన కొన్ని భూములు దాదాపు 40 ఏళ్లుగా ఆక్రమణలో ఉండటంతో వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి హద్దులు ఏర్పాటు చేశారు.

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం పేర ముత్యంపేట శివారులోని పీచుకుంటలో 211, 212 సర్వే నంబర్లలో 1.35ఎకరాలు, తుమ్మ చెరువు సమీపంలోని 260/ఎఫ్ సర్వే నంబరులో 0.36 ఎకరాలు, కొండపైన 362/2 సర్వే నంబరులో 20ఎకరాలు, 362/3 సర్వే నంబరులో 2ఎకరాలు(ఇందులో ఎకరం భూమిలో కల్యాణమండపం నిర్మాణం కోసం తితిదే ఈవో పేరిట 20ఏళ్ల కిందట రిజిస్టరు చేశారు), కొండగట్టు స్టేజి వద్ద(గుట్ట కింద) 380/బీ సర్వే నంబరులో 0.01ఎకరాలు, 380/సీ సర్వే నంబరులో 1.30ఎకరాలు, 389 సర్వే నంబరులో 2.02 ఎకరాలు, మారుతి టౌన్‌షిప్ సమీపంలోని 410/ఎ సర్వే నంబరులో 2.34ఎకరాలు, కొడిమ్యాల మండలం తిమ్మయపల్లె శివారులోని 98/బీ సర్వే నంబరులో 2.05ఎకరాల మామిడితోట, అదే శివారులో 105/బీ సర్వే నంబరులో 1.17ఎకరాలు, రాంసాగర్ శివారులోని 546సర్వే నంబరులో 8.09ఎకరాలు, నాచుపల్లి శివారులోని 558సర్వే నంబరులో 0.17ఎకరాలు, 562సర్వే నంబరులో 0.14ఎకరాల విలువైన భూములున్నాయి. కొండగట్టు స్టేజి(గుట్ట కింద) అన్యాక్రాంతమైన ఆలయ భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా ఆక్రమణదారులు అడ్డంకులు సృష్టిస్తున్నట్లు తెలిపారు. వీటికితోడు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న భూములు కూడా స్వామివారి పేర ఉన్నట్లు ఆలయవర్గాలు వెల్లడించాయి.

**సర్వే చేయించి హద్దుల ఏర్పాటు** కొండగట్టు గుట్టల మధ్యగల సంతొల్లలొద్ది చెక్‌డ్యాం కింది ప్రాంతంలోని ఆలయ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకుని మామిడితోట సాగు చేస్తున్నారు. దాదాపు 3 ఎకరాలకుపైగా ఆలయ భూమిని ఆక్రమించుకుని మామిడిచెట్లు నాటినట్లు గుర్తించాం. ఆలయ భూములను పరిరక్షించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం ప్రత్యేక సర్వే చేపట్టి ఆలయ భూములను గుర్తించి హద్దురాళ్లు కూడా ఏర్పాటు చేయిస్తాం. కొండగట్టు దిగువ ప్రాంతంలోని ఆలయ భూమిలో చేపట్టిన నిర్మాణాన్ని నిలిపివేయించాం. ఆక్రమణదారులపై న్యాయపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నాం. రామకృష్ణారావు, కొండగట్టు ఈవో

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరపున గౌడ సంఘం





ఆధ్వర్యంలో, అలాగే శామీర్ పేట గ్రామానికి చెందిన యాష్కి అరుణ్ కుమార్ గౌడ్- సాయి లక్ష్మీ దంపతులు, ఆరాధ్య వారి కుటుంబ సభ్యులు, బండి బాలరాజు గౌడ్- మహేశ్వరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## ఓటర్ తుది జాబితా పై వివిధ పార్టీల నాయకులతో ఎంపీడీవో సమావేశం...

శామీర్ పేట, (గరుడ వార్త) : ఎంపీడీవో మమతా బాయ్ మండలం లోని ఏడు గ్రామపంచాయతీలోని తుది ఓటర్ జాబితా పై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మంగళ వారం శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మమతా భాయి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ తుది జాబితా పై చర్చించారు. శామీర్ పేట మండలం లోని



7 గ్రామ పంచాయతీల వార్డుల వారీగా మొదటి ముసాయిదా ఓటర్ల జాబితాను గతంలో ప్రచురించినట్లు తెలిపారు. అలాగే రెండవ ముసాయిదా ఓటర్ల జాబితా మీద అభ్యంతరాలు తెలియజేయుటకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల తో సమావేశాన్ని నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మోహన్ రెడ్డి, వెంకటేష్, నరేంద్ర ప్రసాద్, కిష్టప్ప పాల్గొన్నారు.

## పంచాయతీ పోరుకు మరో అడుగు

సిద్దిపేట: పంచాయతీ ఎన్నికల వైపు వడివడిగా అడుగులు పడుతు న్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం వేగం పెంచింది. ఇప్పటికే ఓటరు తుది జాబితా వెలువరించడంతోపాటు పోలింగ్ కేంద్రాల కేటాయింపు పూర్తయింది. వివిధ విభాగాల్లో పర్యవేక్షణకు జిల్లాలో నోడల్ అధికారులను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా బాధ్యతలు అప్పగించారు.

జిల్లాస్థాయిలో వివిధ శాఖల అధికారులు నిర్దేశిత విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన బ్యాలెట్ పెట్టెలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో 12 విభాగాలకు 18 మందిని నోడల్ అధికారులు గానియమించారు.

**23 చోట్ల ఎటూ తేలని వైనం..** గతనెల 30న ఓటర్ల తుది జాబితా విడుదలైంది. మరోవైపు జిల్లాలో 23 పంచాయతీలకు సంబంధించి ముసాయిదా జాబితా ఇప్పటికీ వెలువడలేదు. దీంతో ఆయా గ్రామాల్లో సందిగ్ధత నెలకొంది. సాంకేతిక కారణాలతో సిద్దిపేట గ్రామీణ మండలంలోని 15 గ్రామాల ఓటర్ల జాబితా ప్రదర్శితం కావడం లేదు. ముంపునకు గురైన 8 గ్రామాల పరిస్థితిపై స్పష్టత కరవైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఒకింత నిరాశ చెందుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నామన్నారు.

పంచాయతీలు: 491 వార్డులు: 4,350 మొత్తం ఓటర్లు: 6,23,813

పురుషులు: 3,06,285 మహిళలు: 3,17,521 ఇతరులు: 07

## వరి సాగు.. ఆదరణ బాగు

చేగుంట: యాసంగిలో వరి సాగు జోరందుకుంది. జిల్లా వ్యాప్తంగా నాట్లు వేయటం చివరి దశకు చేరింది. ఎక్కువగా రైతులు వరి సాగు వైపే మొగ్గు చూపారు. ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. విద్యుత్తు సక్రమంగా సరఫరా అవుతుండటంతో సాగుకు ఎలాంటి సమస్య ఉండదనే భావనతో కర్షకులు నాట్లు వేస్తున్నారు. ఈ పాటికే 90శాతం నాట్లు పూర్తిచేశారు. చాలా చోట్ల కలుపు కూడా తీస్తున్నారు. గత ఏడాది కంటే సాగు పెరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నారు.

**వారంలో లక్ష్యం పూర్తి**

జిల్లాలో యాసంగిలో వరి సాగు సాధారణ విస్తీర్ణం 2.65 లక్షల ఎకరాలు కాగా.. ప్రస్తుతం 2.09 లక్షల ఎకరాల వరకు నాట్లు పూర్తిచేశారు. మరోవారంలో లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. గత యాసంగిలో అన్నదాతలు 2.61 లక్షల ఎకరాలు సాగుచేశారు. అప్పుడు దిగుబడులు బాగా వచ్చాయి. జిల్లాలో కౌడిపల్లి, కొల్చారం,



పాపన్నపేట, చేగుంట, హవేలిఘనపూర్, రామాయంపేట, నర్సాపూర్, నిజాంపేట, చిన్నశంకరంపేట, మెదక్, వెల్దుర్తి, నార్సింగి, శివ్వంపేట మండలాల్లో వరి ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు కౌడిపల్లిలో 18,700 ఎకరాలు, పాపన్నపేటలో 18,600 ఎకరాలు, కొల్చారంలో 18,302 ఎకరాలు సాగుచేశారు. మిగతా పాత మండలాల్లో సైతం పది వేల ఎకరాలు దాటింది. **బోర్లలో నీరు..** బోర్లలో నీరు ఎక్కువగానే ఉంది. చెరువుల్లో నీరు ఉండటంతో ఆయకట్టు కింద ఉన్న పొలాలకు నీరు పారించుకునే వీలుంది. చాలా గ్రామాల్లో తూములను వదిలారు. చేగుంట, నిజాంపేట మండలాలకు రెండు, మూడు రోజుల్లో కాళేశ్వరం జలాలు కూడా వస్తున్నాయి. దీంతో బోనాల, పులిమామిడి, బి.కొండాపూర్, నార్లాపూర్, రాయలాపూర్ గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరుతుంది. పంటలు చివరిదశలో ఈ నీరు ఎంతో ఉపయోగపడనుంది. కాలువల్లో సైతం రైతులు మోటార్లు పెట్టుకొని పంటలకు పారించుకునే అవకాశం ఉంది.

## పాఠశాలల నిర్వహణ ఇక సుగమం

హుస్నాబాద్ : ప్రభుత్వ పాఠశాలలకు నిధులు విడుదలయ్యాయి. బడిలో విద్యార్థులకు, వివిధ అవసరాలకు సంబంధించి, క్రీడల నిర్వహణకు రెండో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నర్సింహారెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆటలకు సైతం..**

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ, స్థానిక సంస్థల ఆధ్వర్యంలో నడిచేవి, ఆదర్శ, కస్తూర్బాలు, గిరిజన పాఠశాలలన్నీ కలిపి మొత్తం 2,980 పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వం ఏటా నిర్వహణ నిమిత్తం నిధులను విడుదల చేస్తుంది. వీటిని పలు అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి తొలివిడతలో భాగంగా 50 శాతం నిధులను గతేడాది సెప్టెంబరులో రూ.6 కోట్లు మాత్రమే వచ్చాయి. తాజాగా రెండో విడత విడుదలయ్యాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు పాఠశాల, క్రీడల నిర్వహణకు మొత్తం రూ.11.90 కోట్లు వచ్చాయి. వీటిలో పాఠశాల నిర్వహణకు రూ.9.02 కోట్లు, ఆటలకు రూ.2.88 కోట్లు కేటాయించారు. వికారాబాద్ జిల్లాలోని 1004 బడులకు రూ.3.84 కోట్లు మంజూరయ్యాయి.

**పలు అవసరాలకు..**

ప్రస్తుతం కేటాయించిన నిధులను పాఠశాల రోజువారీ కార్యకలాపాలకు ఖర్చు చేయవచ్చు. చాక్‌పీసులు, రిజిస్టర్ల కొనుగోలు, స్టేషనరీ, ఇంటర్‌నెట్ బిల్లుల చెల్లింపు, ఇతర రికార్డులు, ప్రయోగ పరికరాల కొనుగోలుకు వెచ్చించవచ్చు. జాతీయ పండగల కార్యక్రమాలు, ఆటలపోటీలు, పరికరాల కొనుగోలు, పరీక్షల నిర్వహణ తదితర వాటికి వినియోగించాల్సి ఉంటుంది.

**పిల్లల సంఖ్యకు అనుగుణంగా..**

విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం పాఠశాలలకు నిధులు విడుదల చేస్తోంది. 1 నుంచి 30 మంది పిల్లలుంటే ఓ విద్యాసంవత్సరానికి రూ.10 వేలు, 100 మంది లోపైతే రూ.25వేలు, 101–250 మంది వరకు ఉంటే రూ.50 వేలు, 251–1000 మంది ఉంటే రూ.75 వేలు, అంతకంటే ఎక్కువ మంది ఉంటే రూ.లక్ష వరకు నిధులు మంజూరవుతాయి. క్రీడల నిర్వహణకు సంబంధించి ప్రాథమిక – రూ.5 వేలు, ప్రాథమికోన్నత – రూ.10 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల చొప్పున అందిస్తోంది.

## అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేనా?

గజ్వేల్: బల్దియాల్లో అనుమతిలేని, అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. జనవరి 27తో జిల్లాలోని గజ్వేల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్ బల్దియాల్లోని పాలక పాలకమండళ్ల పదవీ కాలం ముగిసిపోయింది. ప్రత్యేక పాలన ప్రారంభమైంది. ఇప్పటి వరకు కొందరు కౌన్సిలర్లతో ఒత్తిడిని ఎదుర్కొన్న అధికారులు ఇప్పుడు పూర్తిస్థాయి స్వేచ్ఛతో పని చేస్తారని ప్రజలు భావిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించే వాటితోపాటు ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా నిర్మించే భవనాలపై చర్యలు తీసుకుంటారా? లేక మిన్నకుంటారా? అని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు ఇలా:** ఇంటిని నిర్మించుకునే వారు టీఎస్‌బీపాస్ నిబంధనల మేరకు ఎల్‌టీపీల ద్వారా లేదా స్వయంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 15–21 రోజుల్లో అధికారులు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. లేదా కారణాలు చూపుతూ తిరస్కరించాలి. పెండింగ్‌లో పెడితే రోజుకు రూ.వెయి చొప్పున సబంధిత అధికారికి ప్రభుత్వం జరిమానా విధిస్తుంది. బల్దియాల్లో సిల్ట్ ప్లస్ ఫోర్ కింద అంతస్తులో పార్కింగ్ ఏర్పాటు చేస్తే దానిపైన మరో మూడు అంతస్తులకు మించకుండా నిర్మాణాలు చేయాలి. అంతకు మించితే డీటీపీసీ (డైరెక్టర్ అండ్ కంట్రీప్లానింగ్ కమిషన్) అనుమతి తీసుకోవాలి. 33 అడుగుల రోడ్డు, 1.5 మీటర్ల సెట్‌బ్యాక్, ఇంటి చుట్టూ మూడు వైపులా రోడ్డుకు మీటరు దూరం ఉండేలా నిర్మాణం చేపట్టాలి. 75 గజాలకు పైబడి విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టాలంటే అనుమతి తీసుకోవాలి. 239 గజాల విస్తీర్ణం దాటితే బల్దియాకు మార్టిగేజ్ చేయాలి.

**చేపడితే ఎలా?** గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో ప్రధాన రోడ్ల వెంట నిర్మించే పలు దుకాణాల సముదాయాలు, ఇళ్లకు అనుమతి లేకున్నా నిర్మాణాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగాపూర్, పాతబస్తీ, తూప్రాన్‌రోడ్డు, పిడిచేడు రోడ్డు వైపు నిర్మిస్తున్న ఇళ్లకు సగానికిపైగా అనుమతులు లేవని స్థానికులు చెబుతున్నారు. మురుగు కాలువలను మూసేస్తూ నిర్మించినా పట్టించుకోవటం లేదు.

చేర్యాలలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సెట్‌బ్యాక్ కావాల్సిన దుకాణదారులు నిబంధనలు అతిక్రమించి రోడ్డుపైకి మురుగు కాలువల మీదుగా నిర్మాణాలు చేపడుతున్నారు. సిద్దిపేట, జనగామల వైపు వెళ్లే దారుల్లో ఇష్టానుసారంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. కడవేర్గు వెళ్లే రోడ్డులో కుడిచెరువులోకి వరద నీరు చేరే కట్టుకాలువను కుదించి నిర్మాణాలు చేపట్టారు. హుస్నాబాద్‌లో అనుమతి లేకుండా నిర్మించే వాటికి తరవాత కొత్త నెంబర్లు జారీ చేస్తూ పెద్దఎత్తున వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

## దిగుబడుల లోటు.. నష్టాల 'ఘాటు'



ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిరప ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి ఇక్కడికి సరకు వస్తుంది. శుక్రవారం జెండా పాట ధర క్వింటాకు రూ.14వేలు పలికినా, ఎక్కువ సరకును వ్యాపారులు రూ.9వేల నుంచి రూ.13,600 మధ్య కొన్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.1.20లక్షల పెట్టుబడితో పాటు కూలీలు, రవాణాకు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని చెబుతున్నారు. గత డిసెంబర్‌లో సీజన్ మొదలైనప్పటి నుంచి క్రమేణా ధరలు తగ్గుముఖం పట్టాయంటున్నారు. నాణ్యమైన సరకు తెచ్చినప్పటికీ సరైన ధర లభించటం లేదని అనేక మంది అన్నదాతలు వాపోతున్నారు. వ్యాపారులు సిండికేట్ కాకుండా మార్కెట్ పాలకవర్గం, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. రెండున్నరెకరాల్లో పంట పండించాను. ఎకరాకు రూ.1.20లక్షల పెట్టుబడి పెట్టాను. కూలీలకు రూ.50వేల నుంచి రూ.60వేల అదనంగా ఖర్చవుతోంది. తొలి విడత మిరపతీతలో వచ్చిన 20 బస్తాలను మార్కెట్‌కు తెచ్చాను. క్వింటా రూ.11,500 చొప్పున వ్యాపారులు కొన్నారు. ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కాదు. ఈసారి పంట ఆశాజనంగా లేదు. దిగుబడులు తగ్గాయి. నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తుంది.

అజ్మీరా రామకృష్ణ, కొమరారం, (ఇల్లెందు)

ఈ ఏడాది విదేశాలకు ఎగుమతులు పెద్దగా లేకపోవటం వల్ల ఆ ప్రభావం ధరలపై పడుతోంది. కర్షకులు తమ ఇళ్ల దగ్గర మిరపను ఆరబెట్టుకొని వస్తే మంచి ధర పొందవచ్చు. వరంగల్, గుంటూరు మార్కెట్లతో పోలిస్తే ఖమ్మం విపణిలో మిరప ధరలు కొంత మెరుగ్గా ఉన్నాయి. నిత్యం మార్కెట్‌లో పర్యటిస్తూ రైతులకు అన్యాయం జరగకుండా పాలకవర్గం శ్రద్ధ చూపుతోంది.

యరగర్ల హనుమంతరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్

రెండున్నరెకరాల్లో పంట పండించాను. మార్కెట్‌కు 15 బస్తాల మిరప తెస్తే క్వింటా రూ.12వేల చొప్పున వ్యాపారులు కొన్నారు. జెండా పాట ధర క్వింటాకు రూ.14వేలు పలికినా రూ.2వేలు తగ్గించి ఖరీదు చేశారు. గ్రామాల్లో కూలీలు దొరకటం లేదు. పంటను కోసేందుకు రూ.వేలు వెచ్చించాల్సి వస్తోంది. అన్ని ఖర్చులులెక్కిస్తే రైతులకు మిగిలేది అప్పులే.

బాణోతు విజయ, చిలుకోడు, మహబూబాబాద్ జిల్లా

## నిధులు రావు.. పనులు కావు



కారేపల్లి : పల్లెల్లో పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఫిబ్రవరి 1వ తేదీతో ఏడాది పూర్తవుతోంది. 2వ తేదీ నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పేరుకు ప్రత్యేక పాలన అయినప్పటికీ పల్లెల అభివృద్ధి మాత్రం నామమాత్రంగా సాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో కార్యదర్శులకు తలకు మించిన భారం అవుతోంది. కొందరు కార్యదర్శులు రూ.లక్షల్లో ఖర్చు చేశారంటే అతిశయోక్తికాదు.

**సమస్యల నమోదు రికార్డులకే పరిమితం**

ప్రతి రెండు నెలలకు ఒకసారి ప్రత్యేక అధికారులతో నిర్వహించే గ్రామసభల్లో ప్రధాన సమస్యలను చర్చించి రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారు. ఆ సమస్యలు మాత్రం దస్త్రాల నమోదుకే పరిమితం అవుతున్నాయి. ప్రధాన సమస్యల పరిష్కారం నిధులతో ముడిపడి ఉంది. నిధులు లేకపోవడంతో సమస్యల పరిష్కారంపై పట్టింపు కరవైంది. ప్రభుత్వం నుంచి పంచాయతీ కార్మికుల వేతనాలు మంజూరు అవుతుండటంతో గత ఏడాది డిసెంబర్ వరకు చెల్లింపులు పూర్తి చేశారు. పంచాయతీ ఖజానా ఖాళీగా ఉండటంతో గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. పనులు చేయడానికి పైసలు లేకపోవడంతో ఉన్న కొద్ది వాటితో సర్దుకుపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి పని నగదుతో ముడిపడి ఉండటం, చేసేందుకు నిధులు లేకపోవడం కారణాలుగా నిలుస్తున్నాయి.

**ఇప్పటికే రూ.లక్షల్లో పెట్టుబడి**

ఏడాది కాలంగా స్పెషలాఫీసర్ల పాలన మొక్కుబడిగా సాగుతోంది. పంచాయతీ కార్యదర్శులు విద్యుత్తు దీపాలు, ట్రాక్టర్లకు డీజిల్, మరమ్మతులు, మోటార్ల మరమ్మతులు, చేతి పంపుల మరమ్మతులు, గ్రామ సభల ఖర్చులు, బ్లీచింగ్ పౌడర్‌తోపాటు చిన్నచిన్న పనులు మాత్రం అప్పులు తెచ్చి చేపడుతున్నారు. ఇప్పటికే చిన్న పంచాయతీల్లో సుమారు రూ.లక్ష, పెద్ద పంచాయతీల్లో రూ.2 లక్షల వరకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొనడం విశేషం.

పంచాయతీలు
ఖమ్మం: 589
భద్రాద్రి: 481

**బకాయి బిల్లులు మంజూరు: ఆశాలత, డీపీఓ, ఖమ్మం**

ఎన్ఆర్ఈజీఎస్‌లో గిరిజన ప్రాంతాల్లో జరిగిన పనులకు సంబంధించి బకాయి బిల్లులు మంజూరయ్యాయి. మరి కొంత బడ్జెట్ రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. ఇంటి పన్నుల నిధుల్లో నుంచి పనులు సక్రమంగా చేసిన వాటికి వాడుకునే ఆస్కారముంది.

## వైద్యసేవల్లో 'ధర్మ' సంకటం..!



కొత్తగూడెం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యసేవలందుతాయని ఆశతో వస్తున్న రోగులకు ఇబ్బందులు తప్పటం లేదు. ముఖ్యంగా కాన్పుల కోసం వచ్చే గర్భిణులకు స్కానింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ సీహెచ్‌సీల్లో మినహా.. కొత్తగూడెంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్), సర్వజనాసుపత్రి, భద్రాచలం ఏరియా ఆసుపత్రుల్లో రేడియాలజిస్టుల కొరత వేధిస్తోంది. ఖమ్మం జిల్లాలో మధిర సీహెచ్‌సీ మినహా మరెక్కడా రేడియాలజిస్టులు లేకపోవటంతో ఆయాచోట్ల స్కానింగ్ సౌకర్యం లేదు. కొత్తగూడెంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన తొలినాళ్లలో నెలకు సుమారు 500కుపైగా ప్రసవాలు జరగ్గా.. ఇప్పుడు 250 నుంచి 300కు పడిపోవటమే ఇందుకు నిదర్శనం.

**పేదలపై ఆర్థిక భారం** ఉభయ జిల్లాల్లోని ధర్మాసుపత్రుల్లో కొన్నినెలలుగా రేడియాలజిస్టులు లేకపోవటంతో గర్భిణులు, ఇతర రోగులకు వైద్యపరీక్షలు కరవయ్యాయి. ఆయా ఆసుపత్రులకు వెళ్తున్న రోగులు 'ప్రైవేటు'గా స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. ఇందుకోసం రూ.వేలల్లో ఖర్చవుతుండటంతో పేద ప్రజలకు ఆర్థికంగా చితికిపోతున్నారు. దాదాపుగా అన్ని ఆసుపత్రుల్లో స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ రేడియాలజిస్టులు లేక అవి నిరుపయోగంగా మారుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ సీహెచ్‌సీల్లో రేడియాలజిస్టులు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వారిని సర్వజనాసుపత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రాలకు కేటాయిస్తే ఎక్కువ మంది రోగులకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాల్వంచలో పనిచేస్తున్న రేడియాలజిస్టు అత్యవసర సమయంలో భద్రాచలం వెళ్లి విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

**సీనియర్ రెసిడెంట్లు వస్తేనే..** అరకొర వైద్యసిబ్బందితో నెట్టుకొస్తున్న ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో సీనియర్ రెసిడెంట్ల పాత్ర కీలకం. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విధులు నిర్వర్తించిన 68 మంది సీనియర్ రెసిడెంట్ల ప్రభుత్వ సర్వీసు గత సెప్టెంబర్ 3న ముగిసింది. వారు వెళ్లిపోవటంతో అప్పటి నుంచి ఆయా ఆసుపత్రుల్లో ఆశించిన స్థాయిలో వైద్యసేవలందటం లేదు. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో బోధనాసుపత్రులకు సీనియర్ రెసిడెంట్లు వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. వారిలో రేడియాలజిస్టులూ ఉంటారని, స్కానింగ్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందంటున్నారు.

**వేధిస్తున్న రేడియాలజిస్టుల కొరత..** ప్రైవేట్ వైద్యరంగంలో రేడియాలజిస్టులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసేందుకు ఎక్కువ శాతం మంది మొగ్గుచూపటం లేదని అధికారులు చెబుతున్నారు. పైగా మారుమూల జిల్లాల్లో పనిచేయాలనే ఆసక్తి లేకపోవటం, 'ప్రైవేటు'తో పోల్చితే ప్రభుత్వం తక్కువ వేతనాలు ఇస్తుండటంతో ఇక్కడ రేడియాలజిస్టుల కొరత అధికంగా ఉంది. ప్రభుత్వాసుపత్రుల్లోని వివిధ విభాగాల్లో పరికరాలున్నా రేడియాలజిస్టుల కొరతతో పరీక్షలు చేయటం లేదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా గర్భధారణ శిశువు ఎదుగుదల నిర్ధారణకు 18, 23 వారాల్లో టిఫా పరీక్షలు చేయాలి. అయితే నిపుణులు లేక స్కానింగ్ చేయటం సాధ్యపడటం లేదు. సర్వజనాసుపత్రి, ఎంసీహెచ్‌లో రేడియాలజిస్టుల కొరత వాస్తవమే. ఉన్నతాధికారులు పలుమార్లు నోటిఫికేషన్ జారీచేసినా ఎవరూ రావటం లేదు. జిల్లాలో అందుబాటులోని రేడియాలజిస్టులతోనే వైద్యసేవలు అందిస్తున్నాం. స్కానింగ్ సమస్యపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం.

రాధామోహన్, సూపరింటెండెంట్, సర్వజనాసుపత్రి, కొత్తగూడెం

## ఎం.ఆర్.ఐ. సేవలందక ఆర్థిక భారం

గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో సుమారు ఏడాదిన్నర క్రితం సింగరేణి సహకారంతో సిటీ స్కాన్ సదుపాయం కల్పించడంతో పారిశ్రామిక ప్రాంత ప్రజలకు ఆర్థికభారం తప్పి కొంత ఉపశమనం కలిగినప్పటికీ ఎం.ఆర్.ఐ. సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తీవ్రమైన వ్యాధుల నిర్ధారణలో ఎం.ఆర్.ఐ.కీలకం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు సొంత ఖర్చులతో చేయించుకోవాల్సి వస్తోంది. గతంలో అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ సదుపాయం సైతం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గర్భిణులకు కీలకమైన 'టిఫా' స్కానింగ్‌తో పాటు సీటీస్కాన్ కోసం మంచిర్యాల, కరీంనగర్‌కు వెళ్లాల్సి వచ్చేది. గోదావరిఖనిలోని ప్రాంతీయ ఆసుపత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా సార్వజనిక ఆసుపత్రిగా శ్రేణి పెంచడంతో కొద్ది రోజుల తర్వాత రేడియాలజీ వైద్యులతో పాటు టిఫా స్కానింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత సింగరేణి నిధులతో సీటీ స్కాన్ సదుపాయం కల్పించారు. ప్రస్తుతం ప్రతి నెల సుమారు 250కి పైగా సీటీ పరీక్షలు జరుగుతుండటంతో సుమారుగా రూ.12.5 లక్షల ఆర్థిక భారం ప్రజలకు తప్పుతుంది. జనవరి 28 వరకు ఆసుపత్రిలో 255 సీటీస్కాన్ పరీక్షలు చేశారు. కొన్ని సందర్భాల్లో ఎం.ఆర్.ఐ. తప్పనిసరి కావడంతో ప్రైవేటుకు వెళ్లక తప్పడం లేదు.



ఇందుకోసం రోగులపై వేల రూపాయల ఆర్థిక భారం పడుతోంది. ప్రతినెల సుమారు 15 మంది వరకు ప్రైవేటులో ఎం.ఆర్.ఐ. స్కానింగ్‌లు చేయించుకోవాల్సి వస్తోంది.

**సిబ్బందిపై పెరుగుతున్న ఒత్తిడి**

నిత్యం అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్‌కు వచ్చే వారి సంఖ్య పెరుగుతుండటం.. అందుకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపై ఒత్తిడి పెరుగుతోంది. గర్భిణులతో పాటు ఇతర రోగులకు సమస్య తలెత్తితే అల్ట్రాసౌండ్‌లోనే స్కాన్ చేయాల్సి ఉంటుంది. నిత్యం వెయ్యిమందికి పైగా ఓపీ వస్తున్న గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో రెండే అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు ఉన్నాయి. అవసరమైన వారు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. సీటీస్కాన్ విభాగంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఒప్పంద ఉద్యోగులతో విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఎం.ఆర్.ఐ.సదుపాయం లేకపోవడంతో రోగులు చాలాసార్లు ఆందోళనకు దిగిన సందర్భాలున్నాయి. ఇంత పెద్ద ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ. సదుపాయం లేకపోవడమేంటని, కావాలనే తమను ప్రైవేటుకు పంపిస్తున్నారని పలువురు సిబ్బందితో ఘర్షణకు దిగారు. ప్రభుత్వం స్పందించి గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ. సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆర్డర్లు సరే.. ధరల మాటేమిటి?

సిరిసిల్ల : మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించే చీరల ఆర్డర్లను జిల్లా వస్త్ర పరిశ్రమకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కానీ వాటి సేకరణ ధరతోపాటు కార్మికులు, ఆసాముల కూలీ ధరలు నిర్ణయం కాకపోవడం.. నూలు కొనుగోలులో చేనేత, జౌళి శాఖ నుంచి స్పష్టత రాకపోవడంతో పరిశ్రమ వర్గాలు అయోమయంలో పడ్డాయి. ఇప్పటికీ చీర డిజైన్లు, వాటికి ఉపయోగించే నూలుతోపాటు తొలి విడతగా 4.58 కోట్ల మీటర్లు ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. ఒక్కో చీరను టెస్కో ఎంత ధరకు సేకరిస్తుందనేది స్పష్టత వస్తేనే ఉత్పత్తి ముందడుగు పడుతుంది.

**ఇదీ పరిస్థితి** జిల్లా వస్త్ర పరిశ్రమలో డాబీ, జకార్డు పింజర్లు ఉన్న 16 వేల మర మగ్గాలున్నాయి. వీటిపైనే స్వయం సహాయక సంఘాలకు పంపిణీచేసే చీరల డిజైన్లు చేయడం సాధ్యమవుతుంది. పాలిస్టర్‌లోని ట్విస్టింగ్‌తో ఉన్న ప్రత్యేకమైన నూలుతో గ్రే గలర్‌లో ఈ చీరలను ఉత్పత్తి చేయాలి. జరీ అంచులు వస్తాయి. ఇక్కడ ఉత్పత్తిచేసిన చీరలను డైయింగ్, ప్రింటింగ్, ప్రాసెసింగ్ తర్వాతే పంపిణీ జరుగుతుంది. చీరల నాణ్యతలో రాజీపడకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళిక చేసింది. జిల్లాలో చీరల ఉత్పత్తికే పరిమితం.

ఈ చీరలకు అవసరమైన నూలు, జరీకి 14 కంపెనీలను టెస్కో గుర్తించింది. వీటిని మాత్రమే వాడాలి. ఇవి ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్‌లోని స్పిన్నింగ్ మిల్లుల్లోనే లభ్యమవుతాయి. ట్విస్టింగ్ నూలును ప్రత్యేకమైన వార్ఫిన్ యంత్రంతో బీములుగా తీసుకోవాలి. అడ్డంలో వాడే కండెల్లోనూ పూర్తి భిన్నంగా ఉంటాయి. చీరల ఉత్పత్తిలో ఒక్కో మగ్గానికి రూ.5 వేలతో ప్రత్యేక పరికరాలను అమర్చుకోవాల్సి ఉంటుంది. తొలి విడత చీరల ఉత్పత్తి పద్ధతులను తెలుసుకునే వరకు ఆసాములకు కొంత వెసలుబాటు అవసరం. చీర, జాకెట్‌తో కలిపి 6.30 మీటర్లు ఉంటుంది. ఉత్పత్తి చేసిన చీరల సేకరణ ధరను టెస్కో ప్రకటించాల్సి ఉంది. జిల్లాలోని చిన్న, మధ్యతరహా ఆసాములు ముడిసరకు అవసరమైన పెట్టుబడి భారం తగ్గించేందుకు టెస్కో నూలు బ్యాంకును ఏర్పాటు చేసింది. చీరల ఉత్పత్తుల ఆర్డర్లను 127 మ్యాక్స్ సంఘాలకు ఇచ్చేందుకు నిర్ణయించారు. 4.58 కోట్ల మీటర్ల వస్త్రానికిగాను 400 టన్నులకు పైగా నూలు అవసరం. ఒక్కో సంఘంలో సగటున పది మంది ఆసాములు ఉంటారు. ఒక సంఘానికి ఎంత మేరకు వస్త్రం వస్తుందనే దానిపై వారి శక్తి సమర్థ్యాలు అంచనాకు వస్తాయి. సంఘంలో పెట్టుబడులు నిర్ణయం అయ్యాకే ఆర్డర్లకు అవసరమైన నూలు కొనుగోలుకు డీడీలు తీసి చేనేత, జౌళిశాఖకు అప్పగిస్తారు. 4.58 కోట్ల వస్త్రం ఉత్పత్తి చేయాలంటే గరిష్ఠంగా ఆరు నెలల సమయం పడుతుంది. వీటిని సేకరించాకే టెస్కో చెల్లింపులు జరుపుతుంది. ఉత్పత్తి పూర్తయ్యే వరకు కార్మికుల వేతనాలు చెల్లించాలి. నూలు కొనుగోలు, వేతనాలకు అవసరమైన పెట్టుబడి ఉండాలి. దీనికి ప్రభుత్వం పెట్టుబడి రుణాలు అందించేలా బ్యాంకర్లతో ఆసాములను సమన్వయ పరచాలి. లేకుంటే ప్రభుత్వం ఇచ్చే వస్త్రోత్పత్తుల ఆర్డర్ల లక్ష్యం పక్కదారి పట్టి.. పూర్వం బతుకమ్మ చీరల దారిలోకి మళ్లే అవకాశం ఉంది.

## జలమండలికి.. ఆదిత్య 365

హైదరాబాద్: సౌరవిద్యుత్‌తో విద్యుత్ ఛార్జీల భారం నుంచి కొంతమేర ఉపశమనం పొందే కార్యాచరణను జలమండలి సిద్ధం చేసింది. 365 రోజులూ సౌరశక్తితో విద్యుత్తు అవసరాలు తీరేలా ప్రణాళికలు తయారు చేస్తోంది. ఖాళీ స్థలాలు, రిజర్వాయర్లు, నీటి శుద్ధిప్లాంట్లు, ఇతర ప్రదేశాల్లో 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రంగం సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించింది. జలమండలి ఏటా కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీలను చెల్లిస్తుండటంతో ఆర్థికభారం తప్పడం లేదు. తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీరెడ్కో) ద్వారా జలమండలి సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోంది.

**భారం తగ్గించుకోవడానికి...**

జలమండలికి డిస్కంల నుంచి కనెక్టడ్‌లోడ్ 300 మెగావాట్లు ఉండగా గరిష్ఠంగా 200 మెగావాట్లు వినియోగిస్తున్నారు. ఆర్థికభారం తగ్గించుకోవడానికి సౌరవిద్యుత్ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తోంది.



తెలంగాణ రెడ్కో ఇతర కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలతో కలిసి సౌర విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పనుంది. నగరానికి వస్తున్న కృష్ణా, గోదావరి జలాలతోపాటు భవిష్యత్తులో వచ్చే ప్రాజెక్టులు సైతం విద్యుత్తు వినియోగంపైనే ఆధారపడటంతో సోలార్‌ను ప్రత్యామ్నాయంగా ఆలోచిస్తున్నారు. జలమండలి సగటున నెలకు చెల్లిస్తున్న విద్యుత్తు ఛార్జీలు రూ.120 కోట్లు ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఏటా రూ.40 కోట్ల ఛార్జీల మిగులు ఉంటుందని ప్రాథమిక అంచనా. దీంతో పాటు ఏటా 75 వేల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని భావిస్తున్నారు. ఏడాది క్రితమే 32 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించినా ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో తాజాగా 80 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా నగరానికి నీటిని సరఫరా చేస్తున్న కృష్ణా, గోదావరి పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు, వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూషన్ పంప్‌హౌస్‌లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలతో పాటు ఖాళీ స్థలాల్లో సౌర ఫలకలను ఏర్పాటు చేసి సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ఒక్కో మెగావాట్ ఉత్పత్తికి రూ.70 లక్షలనుంచి రూ.కోటిదాకా వ్యయం అవుతుందని అంచనా వేశారు.

## ఓయూలో డిజిటల్ మార్కెటింగ్ బోధన

హైదరాబాద్: విభిన్న బోధన పద్ధతులు.. నాణ్యమైన సాంకేతిక విద్యా ప్రమాణాలను విద్యార్థులకు అందిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం.. డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా శిక్షణ ఇస్తున్నామని, 4 దశల్లో శిక్షణ, అవగాహన కార్యక్రమాలుంటాయని మానవ విజ్ఞాన, నైపుణ్యాల అభివృద్ధి కేంద్ర సమన్వయకర్త డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి వివరించారు.

**వ్యక్తిగత మార్కెటింగ్.. భిన్నమైన అంశాలు..**

వ్యక్తిగత మార్కెటింగ్.. భిన్నమైన అంశాలు.. ఇలా రెండు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు భవిష్యత్తులో సొంత వ్యాపారం పెట్టుకుంటే ఈ–కామర్స్ తరహాలో విక్రయాలు వంటివాటిలో వేటిని



ఎంచుకున్నా.. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా ప్రచారం కల్పించునేందుకు, అమ్మకాలను పెంచుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు. వ్యాపారాన్ని ప్రారంభించాక సొంతంగా వెబ్‌సైట్‌ను రూపొందించుకోవడం, అనంతరం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం, ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్రచారం చేయడం వంటివాటిని నేర్పించనున్నారు.

**బహుళజాతి సంస్థలు... కంపెనీలకు ప్రచార బాధ్యతలు**

సొంతంగా సంస్థలు.. కంపెనీలు ఏర్పాటు చేసే స్తోమత లేకపోతే బహుళజాతి సంస్థలకు కన్సల్టెంట్లుగా నియమితులవ్వచ్చు. ఉత్పత్తులు వేగంగా అమ్ముడయ్యేలా వినూత్న ఆలోచనలతో పోస్టర్లు, లఘు చిత్రాలను రూపొందించడం.. వాటిని ఎంతమంది వీక్షిస్తున్నారు.. ఏస్థాయిలో రేటింగ్‌లు వస్తున్నాయో పరిశీలించే తర్ఫీదు ఇస్తారు. ప్రస్తుతం 85 మంది చేరి శిక్షణ తీసుకుంటున్నారు.

## రైలెక్కాలంటే బస్సు దిగి నడవాల్సిందే


హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ మార్గంలో ఆర్టీసీ బస్సులను నడుపుతున్నా ప్రయాణికులకు ప్రయాస తప్పడం లేదు. కొత్తగా ప్రారంభమైన టెర్మినల్ ప్రధాన ద్వారం వైపు 400 మీటర్ల దూరంలో బస్సులను ఆపేస్తుండటంతో నడక తప్పడం లేదు. బుకింగ్ కౌంటర్‌కు వెళ్లి అక్కడి నుంచి ప్లాట్‌ఫాం వైపు వెళ్లేందుకు 15 నిమిషాలు పడుతోంది. ఆర్టీసీ బస్సులకేమో పరిమితులు విధించి.. క్యాబ్‌లను ప్రధాన ద్వారం వద్ద నిలిపేలా అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్సులను టెర్మినల్ వరకు అనుమతించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

**విశాలమైన స్థలం ఉన్నా..** ప్లాట్‌ఫామ్ 9 మార్గంలో చెంగిచెర్ల, ఉప్పల్, రామంతాపూర్ నుంచి బోరబండ వరకు ప్రతి 40 నిమిషాలకో బస్సు ఉంది. ప్రధాన ద్వారం నిర్మించిన ప్రాంతంలో విశాల స్థలం ఉన్నా.. స్టేషన్‌కు అల్లంత దూరంలోనే ఆపేస్తుండడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పాత మార్గం వైపు ఇలా..**

పాతమార్గం మీదుగా స్టేషన్‌కు చేరుకునే ప్రయాణికులకు అనువుగా ప్లాట్‌ఫామ్ నెంబర్ 1, 2లను ఎంఎంటీఎస్ రైళ్ల నిలుపుదలకు కేటాయించగా..ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వ్యక్తిగత, ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు సరైన సదుపాయాలు లేవు. ఈ మార్గంలో 100 మీటర్ల దూరంలో బస్సులు నిలుపుతున్నా...రహదారి విస్తీర్ణం తక్కువగా ఉండటంతో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. త్వరలో రైళ్ల సంఖ్య పెరగనున్న తరుణంలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

## కఠోర శబ్దం.. కర్ణానికి అనర్థం



కరీంనగర్ : భారీ ద్విచక్రవాహనాల వినూత్న హారన్, భారీగా వచ్చే సైలెన్సర్ ధ్వనిపై యువతకుకు ఉండే క్రేజ్ రోడ్డుపైకి వచ్చే వారి పాలిట శాపంగా మారుతోంది. భారీ శబ్దాలు చేస్తూ దూసుకెళ్తున్న తీరుతో ప్రజల గుండెలు జల్లుమంటున్నాయి. వాయు, ధ్వని కాలుష్యాలతో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో భారీ శబ్దాలతో దూసుకెళ్లే వాహనాలు ఎక్కువయ్యాయి. హారన్లతో మోత మోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఈ బాధలు నిత్యం ఎదుర్కొంటున్నారు. ఒరిజినల్ సైలెన్సర్లను తీసి భారీ శబ్దం వచ్చే వాటిని అమర్చుకొని ట్రెండ్ అంటున్నారు. పోలీసు, రవాణాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేయాల్సిన అవసరంపై  కథనం.

**తనిఖీ చేస్తున్నా..**

వాహనాల తనిఖీ సమయంలో కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శబ్ద కాలుష్యం చేస్తున్న బుల్లెట్ బండ్లను పట్టుకొని  ఠాణాకు తరలిస్తున్నారు. ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్‌ను పోలీస్‌స్టేషన్‌లోనే మార్చుకొని తీసుకెళ్లాలనే నిబంధనను కఠినంగా అమలు చేసున్నా.. యువతలో మార్పు రావడంలేదు. పోలీసులతోపాటు రవాణాశాఖ అధికారులు దృష్టి సారించాలి.

**ఈ ప్రాంతాల్లో హారన్ కొట్టొద్దు..**

రోడ్డుపై వెళ్తున్న సమయంలో ముందు వాహనం వస్తే అడ్డుగా ఉన్న వాహనాలు పక్కకు వెళ్లేందుకు సాధారణంగా  వాహనదారులు హారన్ కొడతారు. కానీ ఆసుపత్రులు, విద్యాలయాలు, న్యాయస్థానం, ఠాణాలు, పార్థనాలయాలు, పర్యావరణ ప్రాంతాల్లో హారన్ కొట్టడం నిషేధం. ఈ అంశంపై పోలీసులు, రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పించాలి.

**రిజిస్ట్రేషన్ తరువాత..**

భారీ ద్విచక్రవాహనాలను కంపెనీలు నిబంధనల మేరకే తయారు చేస్తాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సైలెన్సర్‌లో మఫ్లర్‌ను తీసేస్తుంటారు. భారీగా శబ్దం వచ్చే సైలెన్సర్, వివిధ రకాలుగా వచ్చే హారన్‌ను అమర్చుకొంటున్నారు. రాత్రి, పగలు అంటూ తేడా లేకుండా దూసుకెళ్లడంతో రోడ్డుపై వెళ్లే మహిళలు, యువతులు వింతగా పెద్దగా వచ్చే శబ్దాలతో ఉలిక్కిపడుతున్నారు. జంతువులు అరిచినట్లు, ఒకేసారి పెద్దగా శబ్దం రావడం, చిన్న వాహనాలకు భారీ వాహనాల హారన్, వింత హారన్లతో రోడ్లపై ఉన్నవారిని భయపెడుతున్నారు.

**నరం దెబ్బతింటే చెవుడు..**

భారీ శబ్దాలతో చెవి నరాలు దెబ్బతిని చెవుడు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒక్కసారి నరం దెబ్బతింటే ఎలాంటి శస్త్రచికిత్సలు లేవు. మిషన్ తప్పనిసరిగా అమర్చుకోవాల్సి ఉంటుంది. మానవుల చెవులు 25 నుంచి 35 డెసిబుల్స్ మాత్రమే వినగలుగుతాయి. కానీ ఇలాంటి బండ్లలో వచ్చే శబ్దం 55 నుంచి 70 డెసిబుల్స్‌లో ఉంటుందని అంచనా. సాధారణంగా 70 ఏళ్లు దాటితే వినికిడి శక్తి తగ్గుతుంది. కానీ ఎక్కువ శబ్దాలు వినేవారికి 40 నుంచి వినికిడి సామర్థ్యం తగ్గుతోంది. అధిక శబ్దాలతో రక్తపోటులోనూ మార్పులు ఉంటాయి. డాక్టర్ వంశీకృష్ణారావు (ఎంఎస్, ఈఎన్‌టీ)

**సీజ్ చేసి జరిమానా..**

శబ్దకాలుష్యం చేస్తున్న ద్విచక్రవాహనాలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం సైలెన్సర్, హారన్ లేకుంటే పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనాన్ని సీజ్ చేసి రూ.1200 జరిమానా విధిస్తున్నాం. రోడ్లపై ఎవరికి ఆటంకం కలగకుండా వాహనాలు నడపాలి, మెకానిక్‌లు కూడా సైలెన్సర్లు, చిన్న వాహనాలకు భారీ హారన్‌లు బిగించొద్దు. కరీంఉల్లాఖాన్, ట్రాఫిక్ సీఐ, కరీంనగర్

## బకాయిలు రూ.6.26 కోట్లు




హుజూరాబాద్  : వ్యవసాయ శాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్మించిన రైతు వేదికల నిర్వహణ గాలిలో దీపంలా మారింది. వాటి నిర్వహణకు అవసరమైన నిధులు నెలల తరబడి మంజూరు చేయకపోవడంతో రూ.కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో వీటి నిర్వహణ ఏఈవోలకు గుదిబండగా తయారైంది. వారి వేతనాల నుంచి నిర్వహణ ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో 258 రైతు వేదికలు నిర్మించారు. ముందుగా ఒక్కో రైతు వేదిక నిర్వహణ ఖర్చుల కింద ప్రతీ నెలా రూ.3 వేలు ఇచ్చారు. ఈ నిధులు సరిపోకపోవడంతో వ్యవసాయ శాఖ ప్రతిపాదనల మేరకు 2020 ఏప్రిల్ నుంచి రైతు వేదికల నిర్వహణకు రూ.9 వేల చొప్పున అందజేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఆగస్టు వరకు 5 నెలలకుగానూ ఒక్కో రైతు వేదికకు రూ.45 వేలు అందించింది. ఇక ఆ తర్వాత ఒక్క పైసా విదల్చలేదు. ఉమ్మడి జిల్లాలోని రైతు వేదికల నిర్వహణ నిధుల బకాయిలు రూ.6,26,94,000 మేర పేరుకుపోయాయి. 27 నెలలుగా మండల వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) తమ వేతనాల నుంచే నిర్వహణ ఖర్చులు భరిస్తున్నారు. విద్యుతు ఛార్జీలు, పారిశుధ్య నిర్వహణ, మరమ్మతులు, స్టేషనరీ, రైతు శిక్షణ, తాగునీటి సౌకర్యాలకు నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని, ఒక్కో రైతు వేదికకు రూ.2.43 లక్షలు రావాల్సి ఉందంటున్నారు. పైగా ఒక్కోదానికి రూ.12 వేల నుంచి రూ.15 వేల చొప్పున విద్యుత్తు బకాయిలు పేరుకుపోయాయని ఏఈవోలు అంటున్నారు.

**నిర్వహణ పనులన్నీ ఏఈవోలకే..** రైతు సమావేశాలు జరిగిన సందర్భంలో కనీసం తాగునీరు, తేనీటికి కూడా డబ్బుల్లేవని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటెండర్ కూడా లేకపోవడంతో ఏఈవోనే తాళం తీసుకుని శుభ్రం చేసుకుని విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయా ధికారులు, రైతులు సమావేశమై సాగు సమస్యలు, ఆధునిక పద్ధతులపై చర్చించేందుకు వీలుగా ప్రతీ అసెంబ్లీ నియోజవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. కానీ నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో తామే అన్ని పనులు చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే సమయానికి రైతు వేదికలను సిద్ధం చేయాల్సి వస్తోందని ఏఈవోలు అంటున్నారు. ప్రతీ నెలా తమ వేతనం నుంచే నిర్వహణ ఖర్చులు భరించాల్సి వస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. ఒక్కో కేంద్రానికి మినీ భూసార పరీక్ష ల్యాబ్ కిట్లను అందజేసి వీటి ద్వారా వేదికల్లో పరీక్షలు చేయాల్సి ఉన్నా నిధులు విడుదల చేయకపోవడంతో ఈ ప్రక్రియ కూడా అటకెక్కింది.

## హమ్మయ్యా.. నిధులొచ్చాయ్!

కరీంనగర్ : విద్యాసంవత్సరం ముగింపు దశలో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రాష్ట్ర విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. పాఠశాలల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్న సమయంలో మంజూరు చేయడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలలతోపాటు కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, గిరిజన సంక్షేమ పాఠశాలలకు కంపోజిట్ స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్ మంజూరు చేశారు. గతేడాది జులై, ఆగస్టు నెలల్లో 50 శాతం, తాజాగా సమగ్ర శిక్షా అధికారులు మిగిలిన 50 శాతం నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

**విద్యార్థుల సంఖ్యనుబట్టి..**

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలకు మొత్తం రూ.3,08,77,500 మంజూరయ్యాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యనుబట్టి వీటిని  అందించారు. 1–30 మంది విద్యార్థులు గల బడులకు రూ.10 వేలు, 31–100 మందికి రూ.25 వేలు, 101–250 విద్యార్థులకు రూ.50 వేలు, 251–1000 మందిగల బడులకు రూ.75 వేల చొప్పున మంజూరు చేశారు. ఇప్పటికే ఆ నిధుల్లోని 50 శాతం రావడంతో  విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు పాఠశాలల నిర్వహణకు ఉపయోగపడ్డాయి. తాజాగా మిగిలిన 50 శాతం నిధులు రావడంతో నిర్వహణ ఖర్చులకు ఇబ్బందులు తప్పాయి. పాఠశాలల్లో చాక్‌పీసులు, రిజిస్టర్లు, స్టేషనరీ, చిన్న మరమ్మతులు, బిల్లుల చెల్లింపు, ప్రయోగ పరికరాల కొనుగోలు, ఇంటర్నెట్ ఛార్జీలు వంటి వాటికి ఖర్చు చేయనున్నారు. 50 శాతం నిధులు మంజూరు చేయడంతో జగిత్యాల జిల్లాకు రూ.కోటి వరకు



కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు లక్షల్లో నిధులు మంజూరయ్యాయి. ఎస్ఎంసీ ఖాతాల్లో ఈనిధులు జమకానున్నాయి.

**క్రీడా నిధులు సైతం..**

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలకు రావాల్సిన మిగిలిన 50 శాతం క్రీడా నిధులు మంజూరయ్యాయి. ప్రాథమిక పాఠశాలలకు రూ.5000, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10,000, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల చొప్పున అందజేస్తున్నారు. విద్యార్థుల ఆటలు, వ్యాయామం కోసం, క్రీడా పరికరాల కొనుగోలుకు వాటిని ఖర్చు చేస్తారు. ఉమ్మడి జిల్లాకు క్రీడా గ్రాంట్ కింద రూ.1,24,22,500 మంజూరయ్యాయి. గతంలో 50 శాతం నిధులు వచ్చినా స్పోర్ట్స్ సెంటర్ల  మాయజాలానికి ఆకర్షితులైన పలువురు నాసిరకం పరికరాలను కొనుగోలు చేసి నిధులు దుబారా చేసినట్లుగా విమర్శలున్నాయి. కొనుగోలు చేయాల్సిన క్రీడా, వ్యాయామ పరికరాల వివరాలు, ధరలను అధికారులే నిర్ణయించినా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని ఆరోపణలు ఉన్నాయి.

## స్వచ్ఛతకు చర్యలు

సారంగాపూర్ : స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా అత్యంత రద్దీగా ఉండి ప్రభుత్వ స్థలం ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాలు, ప్రార్థన స్థలాలు, బస్టాండ్లు, ఆస్పత్రులు, మార్కెట్‌లతోపాటు అత్యంత రద్దీగా ఉండి ప్రభుత్వ స్థలాలు ఉన్న ప్రాంతాల్లో ఆధునిక టెక్నాలజీతో స్నానాల గది, మూత్రశాలలు, మరుగుదొడ్డి నిర్మించనున్నారు. ఇందులో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా 70 శాతం చెల్లిస్తుండగా, 30 శాతం గ్రామ పంచాయతీలు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో 18 స్థలాలు ఎంపిక చేయగా నిర్మాణాలకు జిల్లా



అధికారులు పరిపాలన అనుమతులు మంజూరు చేశారు.

**రూ.3 లక్షల నిధులతో..**

రూ.3 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.2.10 లక్షలు స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్బీఎం) కింద, రూ.90 వేలు 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు వ్యయం చేయనున్నారు. రద్దీ ప్రాంతాల్లో రూ.5 లక్షలతో అదనంగా వస్తువుల విక్రయాలకు గది నిర్మాణం చేపట్టనున్నారు. డీఆర్డీఏ, ఎస్బీఎం అధికారులు సంయుక్తంగా నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

**రద్దీ ప్రాంతాల్లో..: హారిణి, ఎస్బీఎం, జిల్లా సమన్వయకర్త** రద్దీ ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛ భారత్ మిషన్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 18 నిర్మాణాలు చేపట్టాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉండడమే కాకుండా ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి.

## చిట్టీల పేరుతో రూ.కోట్లకు కుచ్చుటోపీ?

ఇల్లెందు : ఓ ప్రైవేటు చిట్టీ వ్యాపారి ఘరానా మోసం పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పైసా పైసా కూడబెట్టి చిట్టీ వేస్తే.. ఆ డబ్బులను ఓ నిర్వాహకురాలు గద్దలా తన్నుకుపోయిందని బాధితులు వాపోతున్నారు. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని 24 ఏరియా కేంద్రంగా.. సింగరేణి కార్మికులు, వారి కుటుంబీకులే లక్ష్యంగా ఓ మహిళ చిట్టీలు నడుపుతోంది. గత 20 సంవత్సరాల నుంచి నమ్మకంగా కమీషన్‌పై ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తోంది. కొత్త చిట్టీలు ప్రారంభించడంతో పాటు, కొంతకాలంగా చిట్టీ పాడిన వారికి డబ్బులను చెల్లించడం లేదు. గట్టిగా అడిగిన వారికి వడ్డీలు చెల్లిస్తూ నెట్టుకొచ్చింది. చివరకు  ఉడాయించినట్లు తెలిసి బాధితులు వాపోతున్నారు.

**సుమారు రూ.3కోట్లు ఎగ్గొట్టిన వైనం?**

చిట్టీ నిర్వాహకురాలు ఓ ప్రైవేటు ఉద్యోగి భార్య. గతంలో నమ్మకంగా చెల్లింపులు చేయడంతో ప్రస్తుతం వంద మందికి పైగా చిట్టీలు వేస్తున్నారు. ఆయా గ్రూప్ సభ్యుల్లో ఎక్కువగా సింగరేణి యూనియన్ల నాయకులు, కార్మికులు, విశ్రాంత కార్మికోద్యోగులున్నారు. నిర్వాహకురాలిపై నమ్మకం పెరగడంతో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల్లోని కుమార్తెలు, అల్లుళ్లు, బంధువులనూ చేర్పించారు. ఒక్కో ఇంట్లో సుమారు ముగ్గురు, నలుగురు వరకు చిట్టీలు కడుతున్నారు. పలువురు సభ్యులు చిట్టీ పాడిన తర్వాత వచ్చిన డబ్బును సైతం ఆ మహిళకే వడ్డీకి ఇచ్చేవారు. గత మూణ్నెల్లుగా ఎవరికీ డబ్బులు, వడ్డీ చెల్లించకపోవడంతో కొందరికి అనుమానం వచ్చింది. బకాయిలను లెక్కతీయగా రూ.3 కోట్లుగా తేలాయి. గట్టిగా నిలదీయడంతో రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తోంది. గత కొద్దిరోజుల నుంచి ఆమె కనిపించకుండా పోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కొందరు పెద్దలకు మాత్రం తమ సొమ్ము గుట్టుగా ముట్టినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సాధారణ కార్మికులు తమ గోడు ఎవరికి చెప్పాలో తెలియక మనోవేదన చెందుతున్నారు. ఈ విషయం స్థానిక పోలీసుల చెంతకు వెళ్లినట్లు సమాచారం. బాధితులు తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, విషయాన్ని పరిశీలిస్తామని  చెప్పారు.

## నను బ్రోవమని చెప్పవే..

నేలకొండపల్లి నేలకొండపల్లిలో శనివారం నుంచి మూడు రోజులపాటు భక్తరామదాసు జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. భద్రాచలం దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వ భాషా, సాంస్కృతికశాఖల ఆధ్వర్యంలో ఏటా ఉత్సవాలు జరుగుతాయి. స్థానిక భక్త: రామదాసు విద్వత్ కళాపీఠం బాధ్యులు తమ సహకారాన్ని అందిస్తున్నారు. ఏటా మాఘశుద్ధ తదియ నుంచి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఈ ఏడాదికి ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్నారు. రామదాసు పదోతరం వంశీయులు కంచర్ల శ్రీనివాస్ కుటుంబీకులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవనున్నారు. రామదాసు కీర్తనలు, నగర సంకీర్తన, వాయిద్య ప్రదర్శనలు, భక్తి నృత్యాలు, గానకచేరిలు, వాగ్గేయకారుల ప్రదర్శనలతో ధ్యానమందిరం మార్మోగనుంది. ధ్యానమందిర ప్రాంగణం వద్ద నూతనంగా ఆడిటోరియాన్ని నిర్మించారు. గతంలో ధ్యానమందిర ప్రాంగణంలోనే కార్యక్రమాలు నిర్వహించగా ఈ ఏడాది నుంచి నూతన ఆడిటోరియంలో భద్రాచల దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి.

భద్రాచలం ట్రస్టు బోర్డులో స్థానమివ్వాలి..

రామదాసు భద్రాచల దేవస్థానాన్ని నిర్మించినందున ట్రస్టు బోర్డులో ఇక్కడి స్థానికులొకరికైనా చోటు కల్పించేలా సంప్రదాయాన్ని అనుసరించాలని ప్రధానంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భక్త రామదాసు అపరభక్తుడే కాక చరిత్రలో ప్రముఖ వాగ్గేయకారుడు. ఆయన పేరుతో ఆధ్యాత్మిక, సంగీత రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందిస్తే చరిత్రలో నిలిచిపోతుంది. రామదాసు రూపాన్ని అంచనా వేసి సరైన విగ్రహాన్ని నేలకొండపల్లిలో ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ధ్యానమందిరాన్ని పునఃనిర్మించి సీతారామచంద్రుల దేవాలయాన్ని అనుబంధంగా ఏర్పాటు చేస్తే తన జన్మస్థలంలోనూ పరమ భక్తుని కోరిక నేరవేరినట్లువుతుంది. పరిసర ప్రాంతాలను మందిరం అభివృద్ధి కోసం సేకరించి ఉంచితే శ్రీరామనవమి తదితర పండుగలకు వేలాదిగా భక్తులొస్తారని అంచనా. జయంత్యుత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కేటాయించి సీఎం, గవర్నర్ స్థాయి వ్యక్తులు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తే ధ్యాన మందిరం విశిష్టత భావితరాలకూ అందుతుంది.

# ఎత్తిపోతలే ఆధారం.. తప్పని భారం..!

ధర్మపురి : యాసంగి సాగుకు ఎత్తిపోతల పథకాలపైనే ఆధారపడి రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. జిల్లాలోని రోళ్లవాగు ప్రాజెక్టు కింద ధర్మపురి మండలంలో 10 వేల ఎకరాలకు పైగా సాగు నీరందించాల్సి ఉండగా నేటికీ షెట్టర్లను బిగించకపోవడంతో సాగు నీరందించే పరిస్థితి లేకుండా పోయింది. కాలువల ద్వారా నీరురాని దుస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయం లేకపోవడంతో గోదావరినది నీటి ఆధారంగానే అన్నదాతలు ఎక్కువగా పంటల సాగు చేస్తున్నారు. ధర్మపురి ఎస్సారెస్పీ డివిజన్ పరిధిలోనిఎత్తిపోతల పథకాలు ఉన్నాయి.

**రైతులకు ఇక్కట్లు...**

ఈ ఎత్తిపోతల పథకాలకు మరమ్మతుల నిర్వహణ భారం రైతులపై పడుతోంది. ఒక్కో ఎత్తిపోతల పథకం నిర్వహణకు రూ.లక్షల్లో వ్యయం అవుతోంది. రైతులంతా కలిసికట్టుగా వీటికి మరమ్మతులు చేపడుతున్నారు. యాసంగి పంటకు ఈ ఎత్తిపోతల పథకాలే ఆధారం. సాగు నీరందించే సమయంలో 18 హెచ్‌పీ మోటార్లన్నీ మరమ్మతులకు గురవుతున్నాయి. నిర్వహణ అధ్వానంగా ఉండటంతో రైతు కమిటీల ఆధ్వర్యంలో ఎకరానికి రూ.5 వేల చొప్పున జమ చేసుకుని ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఒక్కో మోటారుకు ఒకసారి మరమ్మతు చేస్తే కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతోంది. ఒక్కో ఎత్తిపోతల పథకానికి కనీసం ఒక రూ.లక్ష వరకు వ్యయం అవుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే నిర్వహిస్తే మేలు ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతుల బాధ్యతలు ప్రభుత్వానికి అప్పగించాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రతీ సంవత్సరం యాసం గి సీజన్‌లో పంటల సాగుకు నీటికోసం ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. పంటల సాగుకు అయ్యే ఖర్చుకు తోడు ఎత్తిపోతల నిర్వహణ భారం తమపైనే పడుతోందని అంటున్నారు. ఇప్పటికే ఈ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఒక ఆపరేటర్, మరొకరు పని చేస్తున్నారు. చెల్లింపులు, ఇతర నిర్వహణ భారం రైతు కమిటీలే భరిస్తున్నాయి. ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.



# చేపల వేట.. ప్రమాదంతో ఆట

కోదాడ :కోదాడ మండలం మంగలితండాకు చెందిన రామకృష్ణ, కమ్లు, లాలు వేర్వేరు సందర్భాలలో విద్యుత్తు తీగలను ఉపయోగించి చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడ్డారు. అయినా తండావాసులు ప్రమాదకరపు వేటను మాత్రం వదిలిపెట్టడం లేదు. గాలానికి విద్యుత్ తీగను అమర్చి వేటకు వెళ్తున్నారు. నాలుగు నెలల క్రితం కోదాడకు చెందిన ఓ యువకుడు పెద్ద చెరువులో వేటకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. విద్యుత్ స్తంభం నుంచి తీగలను లాగి గాలం సహాయంతో వేటాడటమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. అధికంగా చేపలు పట్టి అమ్ముకోవాలని ఒకరు.. ఇంట్లోకి కూర కోసం మరొకరు.. మద్యం తాగిన మైకంలో ఇంకొకరు.. సందర్భమేదైనా విద్యుత్తును ఉపయోగించి చేపలు పట్టడం చాలా ప్రమాదకరం. కాస్త ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు కోల్పోవాల్సిందే. కళ్లెదుటే ఎన్నో ఘటనలు జరుగుతున్నా కొందరు వ్యక్తులు వాటిని లెక్కచేయకుండా విద్యుత్ అమర్చిన గాలంతో చేపలను వేటాడుతున్నారు. కోదాడ పట్టణంలోని పెద్ద చెరువు నుంచి పాలేరు వాగును కలిపే ఉల్క చెరువులో ఇది నిత్య కృత్యమే. మంగలితండా, నల్లబండగూడెం, అనంతగిరి మండలం కొత్తగూడెంలో ప్రవహిస్తున్న పాలేరు వాగులో ప్రాణాలను పణంగా పెట్టి వేట సాగిస్తున్నారు. సగానికి పైగా వేటగాళ్లు మద్యం మత్తులోనే చేపలు పడుతున్నారు. అధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

కాలువలు, వాగులు, చెరువుల పక్కనే ఉండే విద్యుత్తు మోటార్లు, స్తంభాల నుంచి తీగలు లాగి చేపలు పట్టే గాలానికి అమర్చుతారు. గాలానికి ఎరను తగిలించి నీళ్లలో వేస్తారు. ఎర తినడానికి వచ్చే చేపకు విద్యుత్ తీగ తాకగానే గాలంలో పడుతుంది. ఈ ప్రక్రియలో విద్యుదాఘాతం జరిగితే ప్రాణానికే ప్రమాదం.

**చర్యలు తీసుకుంటున్నాం సైదా, విద్యుత్ ఏఈ కోదాడ గ్రామీణం**

చెరువులు, వాగులు, కాలువల పక్కనే ఉంటున్న రైతులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట కోసం విద్యుత్తు దొంగిలించకుండా హెచ్చరించాల్సిందిగా ఇప్పటికే కోరాం.

# పర్యావరణం బొగ్గు

ఆత్మకూర్ : అటవీ శాఖ అనుమతులు లేకుండా, విలువైన కలపను బట్టీలుగా పేరుస్తూ బొగ్గుగా మారుస్తున్నారు. దీంతో ప్రతి గ్రామంలో వెలిసిన బొగ్గుబట్టీల వల్ల పచ్చని వృక్షాలు బొగ్గు మంటల్లో కలిసిపోతున్నాయి. ఆత్మకూర్(ఎస్) మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో బొగ్గు బట్టీలు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. హరితహారం పేరిట మొక్కలు పెంచుతూ వేగంగా చెట్లను నరికేయడం పరిపాటిగా మారింది. పర్యవేక్షించాల్సిన అటవీశాఖ అధికారులు ప్రతి బట్టీకి నెలవారి మామూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కసారి బొగ్గుబస్తాలను లారీకి ఎక్కిస్తే కనీసం రూ.5వేలకు తగ్గకుండా ముడుపులు పట్టిస్తున్నట్లు తెలుస్తుంది. అలా ఆత్మకూర్(ఎస్), మోతె, చివ్వెంల, సూర్యాపేట మండలాల పరిధిలో రోజూ పది లారీల బొగ్గు బట్టీల నుంచి బయటకు తరలుతున్నట్లు అంచనా. ఈ రకంగా పచ్చని చెట్లను నరికేసి బొగ్గు బట్టీలు అక్రమ సంపాదనకు వనరులుగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి బొగ్గుబట్టీల నిర్వహణను అడ్డుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

**నిషేధిత కలప ఉపయోగిస్తే చర్యలు**

కిరణ్‌కుమార్, అటవీశాఖ రేంజ్ అధికారి

బట్టీలలో నిషేధిత కలప ఉపయోగిస్తే జరిమానాలు విధిస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు బొగ్గు బట్టీలకు అనుమతులు మంజూరు చేస్తున్నాం. ముడుపులు తీసుకుంటున్నట్లు నా దృష్టికి వస్తే మా సిబ్బందిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

# తుది దశకు ఎత్తిపోతల పనులు



గోదావరిఖని : ఉమ్మడి ఖమ్మం జిల్లా మీదుగా గోదావరి సుదూర ప్రాంతం ప్రవహిస్తోంది. పరీవాహక ప్రాంతంలోని ఇసుక నిక్షేపాల సద్వినియోగంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత వర్షాకాలం నదిలో కొట్టుకువచ్చిన ఇసుక పరిమాణాన్ని, నాణ్యతను రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, భూగర్భజల వనరుల శాఖలు అంచనా వేశాయి. భద్రాద్రి జిల్లాలో మొత్తం 17 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు చేపట్టవచ్చని ఉన్నతాధికారులకు నివేదించాయి. ఆయా రీచ్‌లను తమకు కేటాయించాలంటూ గిరిజన సంఘాలు దరఖాస్తు చేశాయి. కానీ, రీచ్‌ల మంజూరులో జాప్యం జరుగుతోంది.

**ఏపీ నుంచి అక్రమంగా తరలింపు..**

భద్రాద్రి జిల్లాలో ప్రస్తుతం ఒక్కచోట (చర్ల) మాత్రమే ప్రభుత్వ అనుమతులతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. మిగతా చోట్ల క్వారీలు ఏర్పాటు చేయకపోవడంతో అక్రమార్కులు గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్‌కు రూ.3–రూ.5 వేల వరకు సొమ్ము చేసుకుంటున్నారు. పెద్ద మొత్తంలో ఇసుక అవసరమున్న గుత్తేదారులకు ఏపీ నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఏపీలోని నందిగామ నుంచి కృష్ణానది ఇసుకను మధిర, వైరా, తల్లాడ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. నిత్యం పదుల లారీల్లో ఇసుక తరలుతోంది. ఇంకోవైపు చూస్తే.. గోదావరిలో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.

**గిరిజన సంఘాల ఆవేదన**

జిల్లా సహకార శాఖ గుర్తింపు గల గిరిజన సంఘాలకు ప్రభుత్వం టీజీఎండీసీ (తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా ఇసుక రీచ్‌లను కేటాయిస్తుంది. జిల్లాలో ఇలాంటి సంఘాలు సుమారు 16 ఉన్నాయి. వీటికి ఒక క్యూబిక్ మీటరుకు లోడింగ్ ఖర్చుగా ప్రభుత్వం రూ.140 చెల్లిస్తోంది. గుత్తేదారులు, స్థానిక వినియోగదారులు టీజీఎండీసీకి క్యూబిక్ మీటరుకు రూ.650 చెల్లించాలి. 2022–23లో 10, 2023–24లో 6 గిరిజన సంఘాలకు రీచ్‌లు ఏడాది వ్యవధితో కేటాయించారు. ప్రస్తుతం రీచ్‌లకు అనుమతులివ్వకపోవడంతో సంఘాలు, ప్రభుత్వం ఇరువైపులా ఆదాయం కోల్పోతున్నాయి. గత నాలుగేళ్లలో పరిశీలిస్తే.. 2022–23లో అత్యధికంగా రూ.136 కోట్లు ఆదాయం రాగా, ఈ ఏడాది కేవలం రూ.45 కోట్లు మాత్రమే సమకూరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మార్కెట్ డిమాండ్‌ను బట్టి అమ్మకాలు పెంచితే మునుపటి కంటే అధికాదాయం సమకూరే అవకాశముంది. “వివిధ శాఖల అధికారులు జిల్లాలో ఇసుక నిల్వలను గుర్తించి నివేదికలు అందజేశారు. వాటి ఆధారంగా తవ్వకాలకు అనువైన ప్రాంతాలను గుర్తించాం. త్వరలోనే టీజీఎండీసీ ద్వారా ఇసుక రీచ్‌లను గిరిజన సంఘాలకు కేటాయిస్తాం.”దినేష్, మైనింగ్ ఏడీ, భద్రాద్రి కొత్తగూడెం

# సింగరేణి బొగ్గు ‘ప్రియం’



కొత్తగూడెం : ఇతర పరిశ్రమలతో పోల్చిచూస్తే సింగరేణిలో బొగ్గు వెలికితీతకు అయ్యే ఖర్చు అధికం. ఈ కారణంతో ఉత్పత్తి ధర కూడా ఎక్కువే. వెస్ట్రన్, మహానది కోల్‌ఫీల్డ్స్ సంస్థలతో పోల్చిచూస్తే సింగరేణి బొగ్గు ధర దాదాపు రెండు రెట్లు అధికం. పెరుగుతున్న ప్రైవేటు సంస్థల పోటీ నేపథ్యంలో.. సింగరేణి తన మనుగడ కోసం ఉత్పత్తి వ్యయం తగ్గింపుపై దృష్టిసారించక తప్పని పరిస్థితి నెలకొంది. ఇటీవల మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాల్లో, తాజాగా జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలోనూ దిద్దుబాటు చర్యలపై యాజమాన్యం సమాలోచనలు జరిపింది. వచ్చే ఉత్పత్తి సంవత్సరంలోగా మార్పు దిశగా చర్యలు చేపడుతోంది.

**ఉత్పత్తి అధిక వ్యయానికి కారణాలివే..**

దేశంలోని ఇతర కంపెనీల్లో బొగ్గు ఉత్పత్తి వ్యయం సింగరేణికన్నా తక్కువగా ఉంటోంది. దీనికి కారణం.. అక్కడ ఒక టన్ను బొగ్గును వెలికితీసేందుకు నాలుగైదు టన్నుల మట్టిని తొలగిస్తే సరిపోతుంది. కానీ, సింగరేణిలో ఒక టన్నుకు కనీసం ఏడు టన్నులకు పైగా మట్టిని తొలగించాల్సి వస్తోంది. దీంతో వ్యయం అధికమవుతోంది. దీంతోపాటు యంత్రాల వినియోగ సామర్థ్యం తీసికట్టుగా ఉంది. ఒక్కో యంత్రంతో సగటున రోజుకు 18 గంటల పాటు ఉత్పత్తి చేపట్టే వీలుంది. కానీ, కేవలం 7 గంటల 24 నిమిషాలు మాత్రమే వినియోగిస్తున్నారు. ఇతర కంపెనీల్లో ఈ పని గంటలు అధికంగా నమోదవుతున్నాయి. అధిక ధరను భరించైనా సింగరేణి బొగ్గునే పరిశ్రమలు కొనేందుకు ఓ కారణం ఉంది. అదే.. రవాణా వ్యయం. వెస్ట్రన్, మహానది కోల్‌ఫీల్డ్స్ బొగ్గు ధర తక్కువ అయినా, రవాణా ఛార్జీలు కలుపుకొంటే సింగరేణి ఉత్పత్తే కాస్త చౌకగా ఉంటోంది. అందుకే, ఇక్కడి విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలు అనివార్యంగా సింగరేణిపై ఆధారపడుతున్నాయి. భవిష్యత్తులో పోటీ ఉన్నందున ఉత్పత్తి వ్యయాన్ని వీలైనంత తగ్గించుకోవాలని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. వరుస సమీక్షలు నిర్వహిస్తోంది.

**చేపట్టాల్సిన చర్యలివీ..**

టన్ను బొగ్గు ఉత్పత్తికి 7 టన్నుల మట్టి తొలగించడం అనివార్యం. దీనికి ప్రత్యామ్నాయం లేదు. యంత్రాలు, మానవ వనరుల పని సామర్థ్యాన్ని పెంచుకోవడమే సింగరేణి ముందున్న ఏకైక మార్గం. ప్రస్తుతం గనుల్లోని షావెళ్ల పనితీరు బాగానే ఉన్నా, మిగతా యంత్రాలపై దృష్టిపెట్టాలి. ఉపరితల గనుల్లో 48 డ్రిల్ యంత్రాలున్నాయి. ప్రస్తుతం వీటిని 5.8 గంటలు మాత్రమే వినియోగిస్తున్నారు. మిగతా సమయంలో వృథాగా ఉండకుండా.. గరిష్ఠంగా రోజుకు 19.4 గంటలు ఉపయోగించేందుకు చర్యలు చేపట్టాలి. అవసరం మేర కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలి. తద్వారా అదనంగా బొగ్గు ఉత్పత్తి అవుతుంది. “సింగరేణిలో మొత్తంగా 828 యంత్రాలు పనిచేస్తుండగా.. వాటి సగటు వినియోగాన్ని వచ్చే ఉత్పత్తి సంవత్సరం కల్లా కనీసం నాలుగు గంటలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇలాచేస్తే మరో 20 లక్షల క్యూబిక్ మీటర్ల బొగ్గు అదనంగా ఉత్పత్తి అవుతుంది. ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు బొగ్గు ఇవ్వగలుగుతాం”.ఎన్.బలరాం, సీఎండీ


# 2 కిలోమీటర్లు.. 8 మలుపులు

మంథని : సింగరేణి ఆధ్వర్యంలోని రహదారిపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పదేళ్ల క్రితం బిట్టుపల్లి శివారులోని అసైన్డ్ భూమి సేకరించిన సంస్థ రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ భూనిర్వాసితులకు పునరావాసకాలనీ కోసం రూ.2 కోట్లతో ఒక వరుస తారు రోడ్డు నిర్మించింది. మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు 2 కి.మీ మేర రహదారిపై ఎనిమిది చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. లోలెవల్ వంతెనలతో రహదారిపై నుంచి నీరు ప్రవహించడంతో గుంతలు ఏర్పడి ప్రయాణికులు అదుపు తప్పుతున్నారు. రోడ్డు మరమ్మతులకు.. విస్తరణకు సింగరేణి శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. 15 రోజుల క్రితం గుంతలు పూడ్చినప్పటికీ అధిక సంఖ్యలో వాహనాలు నడవడంతో పరిస్థితి మొదటికొచ్చింది.

**పెరిగిన వాహనాల రాకపోకలు**

మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామస్థులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. గతంలో మట్టిదారి ఉండేది. అప్పుడు రోజుకు సుమారు 20 వాహనాలు నడిచేవి. ఏడాది క్రితం ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరు వాగుపై వంతెన ప్రారంభించడంతో 1000 వరకు రాకపోకలు సాగిస్తున్నాయి.

**పదేళ్లుగా మరమ్మతు కరవు**



జలగలవంత వాగుపై లోలెవల్ వంతెనతో రహదారిపై నుంచి వర్షాకాలంలో నీరు ప్రవహిస్తోంది. దీంతో గుంతలు ఏర్పడి.. వాహనదారులు అదుపుతప్పుతున్నారు. రచ్చపల్లి వద్ద గత నవంబరు 20న రాత్రి కారు దిచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో గుర్రం మమత, సదయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఢీకొన్న కారు వివరాలు తెలియకుండా పోయాయి. వారానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రహదారిని పంచాయతీరాజ్, రోడ్ల భవనాల శాఖకు అప్పగించక పోవడంతో పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**రెండు వరుసల రహదారి నిర్మించాలి**

రహదారి ఇరుకుగా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రెండు వరుసల రహదారి నిర్మించాలి.వడ్లకొండ రామస్వామి, రచ్చపల్లి

# ఆశలు ఆవిరేనా?

భువనగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాంతీయ వలయ రహదారి ప్రక్రియ రోజుకో అడుగు పడుతోంది. టెండర్లకు ఆహ్వానం పలకడంతో కీలక ఘట్టం ప్రారంభమైంది. ఉత్తర భాగానికి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడంతో.. రాయగిరి, చౌటుప్పల్ ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల గుండెల్లో దడ మొదలైంది. అలైన్‌మెంట్ మార్పుకోసం ఉత్తరం భాగంలో సంగారెడ్డి, యాదాద్రి జిల్లా రైతులు పట్టువీడని విక్రమార్కుల్లా పోరాటాలు చేస్తున్నారు. కోర్టును కూడా ఆశ్రయించారు. భాజపాకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల సారథ్యంలో రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు సంతకాలతో అలైన్‌మెంట్ మార్చాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరిని కలిసి కూడా పలుమార్లు విన్నవించారు. కేంద్ర మంత్రులే హామీ ఇవ్వడంతో మార్పుపై ఆశలు పెట్టుకోగా.. ఈ నేపథ్యంలో ఉత్తర భాగానికి సంబంధించి 161 కి.మీ.లకు 5 బిట్లలో టెండర్లు పిలిచారు. ఇందులో భువనగిరి, చౌటుప్పల్ మండలాలు కూడా ఉన్నాయి. ప్రజ్ఞాపూర్ నుంచి రాయగిరి వరకు 43 కి.మీ., రాయగిరి నుంచి




చౌటుప్పల్ మండలం తంగేడుపల్లి వరకు 35 కి.మీ.లు కూడా ఉండటంతో నిర్వాసిత రైతులు ఆగ్రహంతో ఉన్నారు.

**ఇదీ జిల్లాలో ఇలా..**

యాదాద్రి జిల్లాలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల మీదుగా మొత్తం 59.33 కిమీ మేర ప్రాంతీయ వలయ రహదారి వెళుతుంది. ఇందుకోసం 235 హెక్టార్ల భూమి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాలకు సంబంధించిన 47.18 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ పూర్తిగా సాఫీగా ముగిసింది. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అధీకృత భూసేకరణ అధికారిగా ఉన్నారు. అవార్డు విచారణ పూర్తయ్యింది. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు నివేదిక కూడా పంపించారు.

**ఆందోళనలో భూ నిర్వాసితులు**

భువనగిరి, చౌటుప్పల్ మండలాల్లో భూముల ధర మార్కెట్‌లో రూ.కోట్లలో పలుకుతోంది. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రెండోసారి అలైన్‌మెంట్ మార్చి నోటిఫికేషన్ ఇచ్చి భూములు సేకరిస్తుండటంతో తాము నష్టపోతున్నామని 27 మంది రైతులు హైకోర్టులో ఏడాదిన్నర కిందట రిట్ వేశారు. హైకోర్టు స్టే ఇచ్చింది. రెండు నెలల కిందట కేసు కొట్టివేయడంతో భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చేపట్టి పూర్తిచేశారు. అవార్డు ఎంక్వైరీకి నోటీస్ ఇచ్చినా భువనగిరి, చౌటుప్పల్ రైతులు ఎవరు హాజరు కాలేదు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజాప్రతినిధులపై గుర్రుగా..**

భువనగిరి మండలానికి సంబంధించి అలైన్‌మెంట్ మార్పు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుత ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్వాసితులకు హామీ ఇచ్చారు. పార్టీ అధినేత్రి ప్రియాంక గాంధీతో భువనగిరి ఎన్నికల సభలోనూ హామీ ఇప్పించారు. అధికారంలోకి వచ్చాక వారు తమ సమస్య పట్టించుకోవడంలేదని నిర్వాసితులు గుర్రుగా ఉన్నారు. మోసం చేశారని వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమవుతున్నారు.

**జిల్లాలో ట్రిపుల్ ఆర్ స్వరూపం**

తుర్కపల్లి: వీరారెడ్డిపల్లి, కోనాపూర్, దత్తాయపల్లి, ఇబ్రహీంపూర్ వేల్పుపల్లి యాదగిరిగుట్ట: మల్లాపూర్, దాతర్‌పల్లి(19.33 కిమీ)

భువనగిరి: రాయగిరి, కేసారం, పెంచికలపహాడ్, తుక్కాపూర్, గౌస్‌నగర్, ఎర్రంబెల్లి(15 కిమీ)

వలిగొండ: పహీల్వాన్‌పూర్, రెడ్లరేపాక, పొద్దుటూరు, వర్కుట్‌పల్లి, గోకారం

చౌటుప్పల్ మండలం: చిన్నకొండూరు, చౌటుప్పల్, తాళ్లసింగారం, లింగోజుగూడెం, నేలపట్ల, తంగేడుపల్లి: 25 కిమీ..

మొత్తం సేకరించే భూమి: 235 హెక్టార్లు

**జనరల్ అవార్డు పాస్ చేస్తాం**

శేఖర్‌రెడ్డి, ఆర్డీవో, చౌటుప్పల్

చౌటుప్పల్ మండలం నిర్వాసితులు ఎవరూ అవార్డు విచారణకు రాలేదు. జనరల్ అవార్డు పాస్ చేసి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పంపుతాం. అవార్డు అంగీకరించిన నిర్వాసితులకు పరిహారం డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తాం. కాన్సెంట్ ఇవ్వని వారి డబ్బులను భూసేకరణ అధికారి ఖాతాలో జమచేస్తాం. వలిగొండ మండలానికి అవార్డు విచారణ చేసి ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్ర విభాగానికి రెండు నెలల కిందటే పంపాం. చౌటుప్పల్ అర్బన్‌లో 145 ఎకరాలకు సంబంధించి అవార్డును రెండు రోజుల్లో పంపిస్తాం.

# గడువులోపు గగనమే..!

సూర్యాపేట : ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువు లోపు పూర్తయ్యే అవకాశాలు కనిపించటం లేదు. ఈ నెల 31 వరకు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇంకా మూడురోజులే సమయం ఉండటంతో పూర్తి అవుతుందా.. గడువు పెంచుతారా తెలియటం లేదు. గతేడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇళ్లు లేని వారు తమకు ఇళ్లు తప్పక వస్తుందనే ఆశతో ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేశారు.

**5 పురపాలికలు.. 475 గ్రామాలు** సూర్యాపేట జిల్లాలో ఐదు పురపాలికలు, 475 గ్రామాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అధికారం చేపట్టిన వెంటనే డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి మొదటి వారం వరకు ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో కొత్త రేషన్‌కార్డులు, జీరో విద్యుత్తు బిల్లులు, ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే జీరో విద్యుత్తు బిల్లులు లబ్ధిదారులు పొందుతుండగా, ఇందిరమ్మ ఇళ్లు పంపిణీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు 3,09,062 మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టాలని అధికారులకు సూచించింది. దీంతో జిల్లాలోని పురపాలికలు, గ్రామాల్లో సర్వే చేపడుతున్నారు. ఈ నెల 27 వరకు జిల్లాలో 1,95,106 ఇళ్ల సర్వేను పూర్తి చేశారు. ఇంకా 1,13,956 ఇళ్లు సర్వే చేపట్టాల్సి ఉంది. అందుల్లో 475 గ్రామాల్లో 2,50,685 దరఖాస్తులకు గాను 1,56,132 ఇళ్లకు సర్వే పూర్తయింది. మొత్తం 63శాతం సర్వే పూర్తవగా పురపాలికల్లో 66, గ్రామాల్లో 62శాతం పూర్తయింది. ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం పెట్టుకోగా ఈ మూడురోజుల్లో పూర్తయ్యేలా కనిపించటం లేదు.




# ఏపీ బడ్జెట్ ఎంత...పయ్యావుల కసరత్తు

అమరావతి : కేంద్ర ప్రభుత్వం తాజాగా 50 లక్షల కోట్ల రూపాయలతో బడ్జెట్ ని 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టింది. ఇపుడు ఏపీ వంతుగా ఉంది. ఏపీలో కూడా కొత్త ఆర్థిక సంవత్సరం కోసం బడ్జెట్ ని పూర్తి స్థాయిలో ప్రవేశ పెట్టాల్సి ఉంది. గత ఏడాది జూన్ 12న అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ ఏడాది చివరిలో బడ్జెట్ ని ప్రవేశపెట్టింది. అయితే ఈసారి పూర్తిస్థాయి బడ్జెట్ ని ప్రభుత్వం పెట్టాల్సి ఉంది. దాని కోసం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఈ మధ్యనే ఢిల్లీలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటుగా పయ్యావుల కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై చర్చించారు. ఏపీ ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి రాష్ట్ర ఆర్థిక స్థితి గురించి పనగారియా బృందానికి చంద్రబాబునాయుడు వివరణాత్మకమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు వీలుగా నిధులను ఉదారంగా కేటాయించాలని ఆయన కోరారు. మరో వైపు చూస్తే కేంద్ర బడ్జెట్ నుంచి ఏపీకి వివిధ రంగాల ద్వారా ఏ మేరకు ఎంతెంత నిధులు వస్తాయన్నది కూడా బేరీజు వేసుకుంటున్నారు. ఇవన్నీ కలుపుకుని ఏపీ బడ్జెట్ ని రూపొందించే పనిలో పయ్యావుల ఉన్నారు. ఈసారి బడ్జెట్ లో సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున కేటాయింపులు ఉంటాయని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తి అవుతున్నందువల్ల ప్రజల ఆశలు కూడా అంతే స్థాయిలో ఉన్నందున బడ్జెట్ లో పథకాలకు నిధులు ఇవ్వడం అన్నది తప్పనిసరి అవుతోంది. వచ్చే ఏడాది నుంచి తల్లికి వందనం పథకం అలాగే మరికొన్ని పథకాలను ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం పెద్దలు భావిస్తున్నారు. గత ఏడాదిన ప్రారంభించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం కింద ఈసారి మూడూ ఇవ్వాల్సి ఉంటుంది. దాని కోసం మూడు వేల రూపాయల దాకా ఖర్చు అవుతుందని లెక్క వేస్తున్నారు. అలాగే అన్నదాతా సుఖీభవ పథకం కూడా అమలులోకి తేవాల్సిన అనివార్యత ఏర్పడింది. ఏపెలెఓ మొత్తం 57 లక్షల మంది రైతులు ఉన్నారు. వారందరికీ ఏడాదికి ఇరవై వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందులోనే కేంద్రం అందించే కిసాన్ యోజన పథకం నిధులను కూడా రైతులకు ఈ పథకం ద్వారా న్యాయం చేయాలనుకుంటోంది. దీనికి కూడా బడ్జెట్ లో అధిక నిధులు అవసరం అవుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో భారీగా నిధులను కేటాయించేందుకు చూస్తున్నారు. సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం తగ్గేది లేదని చాటి చెప్పడం జరుగుతుందని అంటున్నారు. అభివృద్ధికి కూడా పెద్ద పీట వేయాల్సిన అవసరం ఉంది. దాంతో కూటమి ప్రభుత్వం ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ జిల్లాలలో అభివృద్ధి పనులకు కేంద్రం అందించే పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్స్ ని ఇచ్చే విషయంలోనూ నిధులను బడ్జెట్ లో చూపించాల్సి ఉంది. మొత్తానికి చూస్తే ఏపీ బడ్జెట్ ఎంత అన్నది ఆసక్తిని పెంచుతోంది. మూడు లక్షల కోట్ల పై మాటగా ఏపీ బడ్జెట్ ఉండవచ్చు అని అంటున్నారు. ఇప్పటికే వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలను కోరిన ఆర్థిక శాఖ బడ్జెట్ ని రూపొందించే పనిలో బిజీగా ఉంది. పయ్యావులకు మాత్రం ఈసారి బడ్జెట్ కత్తి మీద సాముగానే ఉండొచ్చు అని అంటున్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 6న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల తేదీని ఖరారు చేస్తారు అని అంటున్నారు. ఈ నెల 24 నుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని ప్రచారంలో ఉంది.

# మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం: ప్రధాని మోదీ




గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని ప్రధాని మోదీ తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మోదీ ప్రసంగించారు. "రాష్ట్రపతి ప్రసంగం మాలో ఆత్మవిశ్వాసం నింపింది. మరోసారి మా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు. వికసిత్ భారత్ సాధనే మా ప్రభుత్వ లక్ష్యం. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం. గత ప్రభుత్వాలు గరీబీ హఠావో అని నినాదాలు మాత్రమే చేశాయి. కొందరు నేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టిసారించారు. మేం మాత్రం ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇవ్వడంపై దృష్టి పెట్టాం. దేశంలో పేదల కోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లు కట్టించాం. "కొందరు నేతలు పేదల గుడిసెల వద్ద వారితో ఫొటోలు దిగేందుకే ఉత్సాహం చూపిస్తారు. సభలో పేదల గురించి మాట్లాడితే.. ఫొటోలకు ఫోజులిచ్చిన నేతలు మొహం విసుగ్గా పెడతారు. దిల్లీ నుంచి రూపాయి పంపితే.. గ్రామాలకు 16పైసలే చేరుతోందని గతంలో ఓ ప్రధాని వాపోయారు. అప్పట్లో దిల్లీ నుంచి గల్లీ వరకూ ఒకే ప్రభుత్వం ఉన్నా అదే పరిస్థితి ఉండేది. కానీ, ఇప్పుడు దిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోంది. నగదు బదిలీ ద్వారా నేరుగా ప్రజలకే ఇప్పుడు సొమ్ము అందుతోంది" "ప్రజల సొమ్ము ప్రజల చేతికే" అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. కొందరు శీష్ మహల్ నిర్మాణం కోసం అవినీతి చేస్తారు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగింది" అని ప్రధాని మోదీ వివరించారు.

# ఏపీలో 3 కమిటీలకు ఛైర్మన్‌ల నియామకం.. నోటిఫికేషన్ జారీ చేసిన స్పీకర్

అమరావతి: ఏపీ శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల ఛైర్మన్‌లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు.

ప్రజాపద్దుల సంఘం ఛైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు నియామకాన్ని ఆమోదిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు ఫైనాన్షియల్ కమిటీలకు ఛైర్మన్‌లను నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫైనాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 175 మంది శాసనసభ్యుల నుంచి 9 మంది చొప్పున, 58 మంది శాసనమండలి సభ్యుల నుంచి ముగ్గురు చొప్పున మూడు కమిటీల్లో నియమించారు.




# ఆ రంగులు తొలగిస్తాం..మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కీలక వ్యాఖ్యలు

నెల్లూరు: హిందూ ధర్మాలు, ఆలయాలను కాపాడాలనేది సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన అని ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీ సూర్యనారాయణ స్వామి పండుగే రథసప్తమి అని చెప్పారు. భూప్రపంచానికి సూర్యోదయంతోనే వెలుగులు నిండుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు సూచనతో అరసవెల్లిలో జరిగే రథసప్తమి వేడుకలను, రాష్ట్రంలో జరిగే వేడుకలను ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించామని అన్నారు. అరసవెల్లిలో జరిగే వేడుకల్లో సీఎం చంద్రబాబు పట్టవస్త్రాలు సమర్పించాల్సి ఉందని... కానీ ఎన్నికల కోడ్ వల్ల అధికారులనే పట్టువస్త్రాలు సమర్పించాల్సిందిగా ఆదేశాలిచ్చామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గుర్తుచేశారు. నెల్లూరు మూలాపేట శివాలయంలోని సూర్యభగవానుడికు ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. అనాధిగా తమ కుటుంబం రథసప్తమి పూజలు నిర్వహిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పలు ఆలయాల పునర్నిర్మాణానికి నిధుల కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో 18 ఆలయాల పున నిర్మాణాలకు రూ.38కోట్ల నిధులు విడుదలయ్యాయని ప్రకటించారు. మహాశివరాత్రి రోజున శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, దాక్షారామంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. మూలాపేట శివాలయం అభివృద్ధికి మంత్రి నారాయణతో కలిసి ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఏపీలో రాతికట్టడాలకు గత జగన్ ప్రభుత్వంలో రంగులు వేయడం వల్ల పవిత్రతను కోల్పోయాయని తెలిపారు.



ఆ రంగులు తొలగించి, వాటిని కాపాడుతామన్నారు. చరిత్ర, పవిత్రతను భవిష్యత్తు తరాలకు అందిస్తామని చెప్పారు. అందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం. భక్తులు తమ ప్రభుత్వానికి అండగా ఉన్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

# కిడ్నాప్ వివాదంపై స్పందించిన వైసీపీ ఎమ్మెల్సీ



తిరుపతి: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలు మంగళవారం ఎస్వీసెట్ హాల్లో జరగాల్సి ఉంది. అయితే నిన్న రాత్రి నుంచి వైసీపీ ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం కనపడటం లేదని, ఆయనను కిడ్నాప్ చేశారని వైసీపీ నేతలు ఆరోపించారు. అయితే డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఫోన్‌లో అందుబాటులో లేరని ఆయన ఆచూకీ తెలియడం లేదని వైసీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కిడ్నాప్ వివాదంపై వైసీపీ ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం స్పందించారు. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని స్పష్టం చేశారు.

అనారోగ్యంతో తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పారు. కిడ్నాప్ చేశారని వదంతులు సృష్టించొద్దని ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు



# ఢిల్లీ ఎన్నికలు - జోరుగా బెట్టింగ్ లు

ఢిల్లీ : చాలా కాలం తర్వాత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు హోరీహోరీగా జరుగుతున్నాయి. వరుసగా మూడుసార్లు గెలిచి అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీకి విపక్ష బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. దీంతో ప్రస్తుతం హస్తినలో ఒక్కో సీటులో గెలుపు ఇరు పార్టీలకు కీలకంగా మారిపోయింది. ఎన్ని హామీలు ఇస్తున్నా, పైకి ఎంత గంభీరంగా కనిపిస్తున్నా లోలోపల మాత్రం ఆప్, బీజేపీలకు గుబులు అలాగే ఉంది.

ఈ నేపథ్యంలో సర్వేలు, ఒపీనియన్ పోల్స్ అంచనాలు కీలకంగా మారిపోయాయి. వచ్చే నెల 5న జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీ మధ్య గట్టి పోటీ ఉందన్న విషయాన్ని దాదాపు అన్ని సర్వే సంస్థలు, ఒపీనియన్ పోల్స్ నిర్ధారిస్తున్నాయి. అయితే విజేత ఎవరనే విషయంలో మాత్రం మెజార్టీ సర్వే సంస్థలు దాదాపు ఏకాభిప్రాయంతోనే ఉన్నట్లు కనిపిస్తోంది. తాజాగా విడుదలైన పలు సర్వే సంస్థలు, అధ్యయన సంస్థల అంచనాలు చూస్తే ఇదే అర్థమవుతోంది. అలాగే బెట్టింగ్ బజార్లు కూడా ఇప్పుడు విజేతపై క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. ఇప్పటి వరకు వెలువడిన పలు ఒపీనియన్ పోల్స్ అధికార ఆప్ కు ఆధిక్యం కట్టబెట్టాయి. తాజాగా రాజస్థాన్‌లోని ఫలోడి సత్తా బజార్ బెట్టింగ్ మార్కెట్ కూడా ఆప్ 36 సీట్లు సాధించి అధికారం నిలబెట్టుకుంటుందని అంచనా వేసింది. 70 సీట్ల అసెంబ్లీలో ఆప్ కు 39-41 సీట్లు వస్తాయని, అలాగే విపక్ష బీజేపీకి మాత్రం 29 నుంచి 31 సీట్లు వస్తాయని అంచనా వేస్తోంది. గతంలో ఆప్ కు 36 సీట్లు వస్తాయని అంచనా వేసిన సత్తా బజార్.. తాజాగా అంచనా సవరించింది. అదే సమయంలో ప్రముఖ సర్వేల సంస్థ సీ-ఓటర్ కూడా తమ అంచనాల్ని విడుదల చేసింది. ఇందులోనూ ఆప్ హవా కొనసాగబోతోందని తెలిపోయింది. తమ సర్వేలో 51 శాతం మంది ఆప్ తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పినట్లు సీ-ఓటర్ తెలిపింది.

# ఆ ఉచ్చులో పడకండి.. సీఎం చంద్రబాబుకు కీలక సూచన




విజయవాడ, ఫిబ్రవరి 04: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కుల గణన సర్వే చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఐదున్నర కోట్ల రాష్ట్ర జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆమె సూచించారు. మంగళవారం విజయవాడలో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదున్నర కోట్ల జనాభాలో వెనుకబడిన వర్గాల వారి సంఖ్య ఎంతో తేల్చాలన్నారు. అలాగే కుల వివక్షకు గురవుతున్న బలహీన వర్గాల ప్రజలు ఎంత మంది ఉన్నారో లెక్కలు తీయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మనమెంతో మనకంతా అన్నట్లుగా.. రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగాలలో వారి వాటా వారికి దక్కాల్సి ఉందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన న్యాయంగా రిజర్వేషన్లు అమలు కావాల్సి ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కులగణన చేపట్టినా.. బీజేపీ దత్తపుత్రుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్.. ఆ సర్వే వివరాలు తొక్కిపెట్టారని వైఎస్ షర్మిల వ్యంగ్యంగా అన్నారు. ఆ వివరాలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారంటూ మాజీ సీఎం వైఎస్ జగన్?పై మండిపడ్డారు. బీజేపీ డైరెక్షన్?లోనే సర్వే రిపోర్టు బయటకు పొక్కకుండా కుట్ర చేశారంటూ వైఎస్ జగన్?పై నిప్పులు చెరిగారు. ఇక ఓ వైపు దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని లోక్?సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే.. రిజర్వేషన్ల రద్దుకు కుట్ర అంటూ బీజేపీ తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఉచ్చులో మీరు పడవద్దంటూ సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా వైఎస్ షర్మిల సూచించారు. వెంటనే ఏపీలో సైతం కులగణన సర్వే చేపట్టాలని.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సూచించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల అభివర్ణించారు. ఇదో చారిత్రాత్మక ఘట్టమన్నారు. ఈ సర్వే యావత్ భారతావనికి దిక్సూచి అని తెలిపారు. దేశ భవిష్యత్ కోసం రాహుల్ గాంధీ దూరదృష్టికి ఇదొక నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీలు, 17 శాతం ఎస్సీలు, 10 శాతం ఎస్టీలు ఉన్నారని.. అంటే దాదాపు 90 శాతం వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలే ఉండటం విస్మయపరిచిన అంశమని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైతం ఇదే పరిస్థితి ఉంటుందని తాము నమ్ముతున్నామని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. దేశవ్యాప్తంగా జోడో యాత్ర చేశారు. ఈ సందర్భంగా దేశంలో కుల గణన జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. కుల గణన సర్వే చేపడతామని ఆయన ప్రకటించారు. అలాగే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో తెలంగాణ వ్యాప్తంగా కుల గణన సర్వే చేపట్టారు. ఆ సర్వే వివరాలను ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్?లో సైతం కుల గణన సర్వే నిర్వహించాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.




తిరుపతి: తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా తెదేపా అభ్యర్థి మునికృష్ణ ఎన్నికయ్యారు. మునికృష్ణకు 26 మంది, వైకాపా అభ్యర్థి భాస్కర్‌రెడ్డికి 21 మంది మద్దతు తెలిపారు.

దీంతో మునికృష్ణ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా.. కోరం లేకపోవడంతో నేటికి వాయిదా పడింది. తిరుపతి నగరపాలక సంస్థలో 50 మంది కార్పొరేటర్లకుగాను ప్రస్తుతం 47 మంది ఉన్నారు. తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి వైకాపా ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు.

మొత్తంగా 50 మంది సభ్యులకుగాను సగం మంది (25) హాజరు కావాల్సి ఉండగా.. ఎమ్మెల్యే ఆరణితో కలిసి 22 మందే రావడంతో కోరం లేదని సోమవారం అనివార్యంగా ఎన్నికను వాయిదా వేశారు. దీంతో నేడు డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగింది.

# నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తెదేపా అభ్యర్థి మండవ కృష్ణకుమారి

నందిగామ: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నికయ్యారు. ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యురాలు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ క్రమంలో నిర్వహించిన ఎన్నికలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిపి కృష్ణకుమారికి 15 మంది మద్దతు లభించింది. వైకాపా అభ్యర్థి ఓర్సు లక్ష్మికి కేవలం ముగ్గురే మద్దతు తెలిపారు. దీంతో ఛైర్‌పర్సన్‌గా కృష్ణకుమారి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల ప్రత్యేకాధికారి, ఆర్డీవో బాలకృష్ణ ఆమెకు అందజేశారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా-13, తెదేపా-6, జనసేన-1 చొప్పున గెలిచారు. ఆ తర్వాత తెదేపా నుంచి ఒకరు వైకాపాలో చేరారు. ఛైర్‌పర్సన్‌గా వైకాపా నుంచి మండవ వరలక్ష్మి, వైస్‌ఛైర్‌పర్సన్‌గా మాడుగుల నాగరత్నం ఎంపికయ్యారు. ఆ తర్వాత వీరు చనిపోయారు. ప్రస్తుతం ఏడుగురు కౌన్సిలర్లు వైకాపాను వీడి తెదేపాలో చేరడంతో తెదేపా బలం 5 నుంచి 12కు పెరిగింది. జనసేనతో కలిపితే 13. ఎమ్మెల్యేతో కలిపి 14 ఓట్లు ఉన్నాయి. వైకాపాలో ఐదుగురు మిగలగా.. వీరిలో ఒకరు రాజీనామా చేయడంతో నలుగురే మిగిలారు. ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌తో కలిపి ఆ పార్టీకి ఐదు ఓట్లున్నాయి. తాజాగా జరిగిన ఛైర్‌పర్సన్ ఎన్నికలో వైకాపాకు కేవలం ముగ్గురే మద్దతు తెలపడం గమనార్హం.



## అందమైన నభా చీర కట్టు నడుము ఒంపులు..!


2018లో నన్ను దోచుకుందువటే సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. మొదటి సినిమాతోనే టాలీవుడ్‌లో మంచి పేరు దక్కించుకుంది. ఆ సమయంలోనే స్టార్ దర్శకుల ప్రశంసలు దక్కించుకోవడం వల్ల టాలీవుడ్‌లో ఈ అమ్మడికి మంచి ఫ్యూచర్ ఉందని అంతా భావించారు. అయితే కరోనా వల్ల ఈ అమ్మడి కెరీర్ ముందుకు వెనక్కి అయ్యింది. 2019లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ఈ అమ్మడు తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అత్యధిక సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుందని అంతా భావించారు. కానీ కథ రివర్స్ అయ్యింది. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో వచ్చిన ఇమేజ్ నభా నటేష్ కెరీర్‌కి పెద్దగా ఉపయోగపడలేదు. ఆ తర్వాత చేసిన కొన్ని సినిమాలు సైతం బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. అందుకే ఈ మధ్య కాలంలో ఆచితూచి సినిమాలను చేస్తోంది. ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటో షూట్ రెగ్యులర్‌గా వైరల్ అవుతూనే ఉంటాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందంతో అలరించింది. ఈసారి చీర కట్టు



ఫోటోలను షేర్ చేయడం ద్వారా నెటిజన్స్ చూపు తిప్పలేక పోతున్నారు. గతంలో ఎన్నో సార్లు మోడ్రన్ డ్రెస్‌లు, స్కిన్ షో చేసే ఫోటోలను షేర్ చేసింది. కానీ ఈసారి చాలా డీసెంట్‌గా చీర కట్టు ఫోటోలతో కన్ను తిప్పునివ్వడం లేదు. సాధారణంగానే ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసే ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఈసారి అంతకు మించి అన్నట్లు అందాల ఫోటోలు ఉండగా వైరల్ కాకుండా ఎలా ఉంటాయి. చాలా రోజుల తర్వాత నభా నటేష్ నడుము అందం చూపిస్తూ చీర కట్టు ఫోటోలను షేర్ చేసింది. ఫోటోలు షేర్ అయిన తక్కువ సమయంలోనే భారీ ఎత్తున లైక్స్, షేర్స్ దక్కించుకుంది. నభా నటేష్ చీర కట్టు ఫోటోలు చాలా అందంగా ఉన్నాయని కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే ఇంత అందంగా ఉన్న నభా నటేష్‌ను ఎందుకు సినిమాల్లో తీసుకోవడం లేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగులో ఒక సినిమా కన్నడంలో ఒక సినిమా చర్చల దశలో ఉందని తెలుస్తోంది. త్వరలోనే తెలుగులో ఈమె నటించిన స్వయంభూ సినిమా విడుదల కాబోతుంది. చీర కట్టు ఫోటోలతో మతి పోగొడుతున్న నభా నటేష్ ముందు ముందు మరిన్ని ఆఫర్లు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు నటిగానూ మంచి మార్కులు దక్కించుకుంది. కనుక నభా నటేష్ హీరోయిన్‌గా మరిన్ని సినిమాలు చేయాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. చీర కట్టు ఫోటోలలు చూపు తిప్పునివ్వని కారణంగా టాలీవుడ్‌లో కచ్చితంగా భవిష్యత్తులో సినిమాలతో ఈ అమ్మడు బిజీ అయ్యేనా చూడాలి.

## 1000 కోట్ల దాహం తీరేలా ఎన్టీఆర్ లైనప్!

పాన్ ఇండియా మార్కెట్‌లో ఎన్టీఆర్ క్రేజ్‌కు కొత్త పుంతలు తొక్కాల్సిన సమయం ఆసన్నమైంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత అంత భారీ స్థాయిలో వసూళ్లు అందుకున్న సినిమా ఇంకా రాలేదు. 'దేవర' సినిమాతో బిగ్ స్కేల్‌లో వచ్చినప్పటికీ, అది 500 కోట్ల మార్క్‌ను టచ్ చేయలేకపోయింది. వసూళ్లు బాగానే ఉన్నా, ఎన్టీఆర్ మైండ్‌లో ఉన్న లెక్కలు పూర్తిగా చేరినట్లు అనిపించలేదు. అందుకే ఇప్పుడతని ఫోకస్ టోటల్‌గా భారీ కమర్షియల్ కంటెంట్‌పై పడింది. వచ్చే సినిమాలన్నీ 1000 కోట్ల టార్గెట్‌తోనే ప్లాన్ అవుతున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్‌లో కూడా తన మార్కెట్‌ను మరింత పెంచుకోవాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ 'వార్ 2' సినిమా చేశాడు. హృతిక్ రోషన్, ఆదిత్య చోప్రా ప్రొడక్షన్ హౌస్ లాంటి బాలీవుడ్ మాస్ కమర్షియల్ ఫ్రాంచైజీలో కీలక పాత్ర పోషించడం వల్ల, ఉత్తరాదిలో ఉన్న విపరీతమైన ఫాలోయింగ్‌ను తనదిగా చేసుకోవడానికి ఇది రికార్డ్ హిట్ అవుతుందని ఎన్టీఆర్ భావిస్తున్నాడు. హాలీవుడ్ స్థాయి యాక్షన్, గ్రాండ్ మేకింగ్‌తో రాబోతున్న ఈ సినిమా అతని మార్కెట్‌ను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయం. ఈ సినిమా అనంతరం వచ్చే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ దశలో ఉ



ండగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలవ్వబోతోంది. 'సలార్' మాదిరిగా యాక్షన్, మాస్ మసాలాతో నిండిపోయిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందించనున్నారు. ఇది 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమనే అంచనాలు ఇప్పటికే ఉన్నాయి. నీల్ మేకింగ్, ఎన్టీఆర్ క్రేజ్ కలిస్తే రికార్డులు పడిపోవడం ఖాయం. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ తర్వాత ప్రాజెక్ట్‌ను కూడా చాలా స్ట్రాంగ్‌గా లైన్‌లో పెట్టినట్లు సమాచారం. కోలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్న 'జైలర్' డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్‌తో తారక్ ఓ భారీ మాస్ ఎంటర్‌టైనర్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'జైలర్'తో 800 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రజినీకాంత్‌ను బిగ్గెస్ట్ హిట్ ఇచ్చిన నెల్సన్, ఇప్పుడు 'జైలర్ 2' కూడా భారీ టార్గెట్‌తో ప్లాన్ చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత ఎన్టీఆర్‌తో పనిచేయబోతున్నట్లు సమాచారం. నెల్సన్ తన మార్క్ మాస్ ఎంటర్‌టైనర్ సినిమాలతో కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్న దర్శకుడు. ఎన్టీఆర్‌తో కలిసి చేస్తే.. ఇది మినిమమ్ 1000 కోట్ల టార్గెట్ మూవీగా నిలుస్తుందని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తారక్ ఎంచుకుంటున్న లైనప్ చూస్తుంటే, రాబోయే ఏళ్లలో అతని సినిమాలు ఇండియన్ బాక్సాఫీస్‌ను బ్లాస్ట్ చేస్తాయని చెప్పడంలో సందేహం లేదు. పుష్ప 2 ఇచ్చిన నమ్మకంతోనే దేవర 2 స్క్రిప్ట్ పనులు కూడా సాగుతున్నాయి. భవిష్యత్తులో ఆ సినిమా కూడా గ్రాండ్ గానే ఉండవచ్చు అనే టాక్ వస్తోంది.




## ఎట్టకేలకు స్టార్ హీరోకు రూ.100 కోట్ల కలెక్షన్స్




బాలీవుడ్‌లో కరోనా ముందు అక్షయ్ కుమార్ సినిమా చేస్తే వంద కోట్ల వసూళ్లు అన్నట్లు ఉండేది. ఏడాదిలో మూడు నాలుగు సినిమాలతో వంద కోట్లు, అంతకు మించి వసూళ్లు దక్కించుకున్న స్టార్‌గా అక్షయ్ కుమార్ నిలిచారు. అలాంటి అక్షయ్ కుమార్ దాదాపు నాలుగు ఏళ్లుగా వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా మినిమం వసూళ్లు సాధించని పరిస్థితి నెలకొంది. ఒకటి రెండు సినిమాలు కనీసం పాతిక కోట్ల వసూళ్లు దక్కించుకోలేక పోయాయి. కొన్ని సినిమాలు ప్రమోషన్ ఖర్చులు రాబట్టలేక పోయాయి. అలాంటి పరిస్థితుల నుంచి అక్షయ్ కుమార్ మళ్లీ రూ.100 కోట్ల సినిమాను చేయగలిగాడు. స్కై ఫోర్స్ అనే హిందీ సినిమాతో అక్షయ్ కుమార్ చాలా కాలం తర్వాత బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల వసూళ్లు రాబట్టాడు. ఇప్పటి వరకు దాదాపుగా ఈ సినిమా రూ.115 కోట్ల వసూళ్లు రాబట్టినట్లుగా సమాచారం అందుతోంది. సినిమాపై ఉన్న అంచనాల నేపథ్యంలో దాదాపుగా రూ.150 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ చేసింది. సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలి అంటే ఇంకా దాదాపుగా రూ.50 కోట్ల వసూళ్లు రాబట్టాల్సి ఉంది. ఆ స్థాయిలో కలెక్షన్స్‌ని ఈ సినిమా రాబట్టే అవకాశాలు ఉన్నాయా అనేది అనుమానంగా ఉంది. అయినా కూడా అక్షయ్ కుమార్ వంద కోట్ల వసూళ్లు రాబట్టడంతో ఆయన ఫ్యాన్స్‌కి పెద్ద ఊరటగా చెప్పుకోవచ్చు. అక్షయ్ కుమార్ వరుస ఫ్లాప్స్‌తో సతమతం అవుతున్న సమయంలో వచ్చిన స్కై ఫోర్స్ సినిమా హిందీ ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఆర్మీ బ్యాక్ డ్రాప్‌లో, ఎయిర్ ఫోర్స్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందిన సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. అందుకే అక్షయ్ కుమార్ కాస్త ఆలస్యంగానైనా ఈ సినిమాను చేసి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో స్కై ఫోర్స్ సినిమాకు భారీ వసూళ్లు నమోదు అయ్యాయి అంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అక్షయ్ కుమార్ ఇక బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకుంటాడనే నమ్మకం వ్యక్తం అవుతోంది. బాలీవుడ్‌లో స్కై ఫోర్స్ సినిమా తర్వాత మరో రెండు మూడు సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా షాహిద్ కపూర్ హీరోగా పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించిన దేవా సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా అంచనాలను అందుకోవడంలో విఫలం అయ్యింది. అందుకే స్కై ఫోర్స్ సినిమాకు వసూళ్లు కంటిన్యూ అవుతున్నాయి. మరో వారం రోజుల పాటు వసూళ్లు కంటిన్యూ అయితే కచ్చితంగా బ్రేక్ ఈవెన్ టార్గెట్‌ను రీచ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఆకట్టుకునే యాక్షన్ సన్నివేశాలతో పాటు, దేశ భక్తిని కలిగించే కొన్ని సీన్స్ కారణంగా ప్రేక్షకుల ఆదరణ దక్కించుకుంటుంది. అందుకు తగ్గట్లుగానే వసూళ్లను రాబడుతోంది.

## 'సంక్రాంతికి వస్తున్నాం'.. ఇండస్ట్రీలో చిర్రుబుర్రులు!



2025 సంక్రాంతికి వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం మూవీ ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. విక్టరీ వెంకటేష్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన ఆ సినిమాలో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మించిన ఆ మూవీ ఫస్ట్ డే నుంచే భారీ వసూళ్లు రాబడుతోంది. అయితే సుమారు రూ.60 కోట్లతో తెరకెక్కిన చిత్రం ఏకంగా రూ.300 కోట్ల రూపాయల వసూళ్లను సాధించిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో దిల్ రాజుకు చాలా పెద్ద రిలీఫ్ ఇది. రీసెంట్ గా ఆయనే చెప్పినట్లు.. ఎక్కడో పడిపోతున్న వారిని పైకి తీసుకొచ్చి అనిల్ రావిపూడి మళ్లీ దృఢంగా నిలబెట్టాడనే చెప్పాలి. అదే సమయంలో మేకర్స్ నిన్న మూవీ డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్ నిర్వహించారు. ఆ సందర్భంగా కొవిడ్ నుంచి గతుకు రోడ్డుపై ప్రయాణిస్తున్న తమను తారు రోడ్డు పైకి ఎక్కించాడని అనిల్ ను కొనియాడారు దిల్ రాజు. తమకు కొన్ని వీక్నెస్ ఉంటాయని అన్నారు. డిస్ట్రిబ్యూటర్లు తలెత్తుకునేలా చేసిన చిత్రం సంక్రాంతికి వస్తున్నామని అన్నారు శిరీష్. ఈవెంట్ లో చాలా రోజుల తమకు తర్వాత 20 శాతం కమిషన్ వచ్చిందని తెలిపారు డిస్ట్రిబ్యూటర్ ఎల్‌వీఆర్. తాము డబ్బు పోగొట్టుకున్నా బయటకు చెప్పలేని పరిస్థితి అని అన్నారు. నిజం చెబితే నెక్స్ట్ సినిమా ఇవ్వరని, అప్పుడు నష్టపోతామని అన్నారు. డబ్బులు రాకపోయినా సైలెంట్ గా ఉంటామని కామెంట్ చేశారు. అదే సమయంలో కలెక్షన్స్ విషయంలో డిస్ట్రిబ్యూటర్స్ అబద్ధం ఆడినా.. నిర్మాత అబద్ధం ఆడినా.. మీడియా అబద్ధం ఆడినా.. ప్రేక్షకులు నమ్మడం లేదని ఆయన అన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర వైటే ఎక్కువ ఉంటుందని, జీఎస్టీ వచ్చాక ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తున్నామని హరి అన్నారు. 18 పర్సెంట్ రికవరీ ఉంటుందని తెలిపారు. ప్రతీ లక్ష రూపాయలకు 18000 ఇన్వాయిస్ వస్తుందని, అందుకే అకౌంట్ నుంచి ట్రాన్స్ఫర్ చేస్తామని చెప్పారు. క్యాష్ ఇచ్చే రోజులు పోయాయని అన్నారు. జీఎస్టీ వల్ల సినిమా తేడా వచ్చినా డబ్బులు వస్తున్నాయని తెలిపారు. జీఎస్టీ పరిధిలో లేని థియేటర్ల నుంచి వచ్చిన వసూళ్లను కూడా బ్యాంక్ లో వేస్తామని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్ కమిషన్ కే చేస్తున్నామని అన్నారు. తక్కువ సినిమాలకే 20 పర్సంట్ కమిషన్ వస్తుందని తెలిపారు. అలా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు మాట్లాడిన మాటలు.. ఫుల్ వైరల్ అవుతున్నాయి. అదే సమయంలో ఇప్పుడు టాలీవుడ్ లో ఆ విషయంపై చర్చ జరుగుతోంది. చాలా మందికి అలా మాట్లాడటం నచ్చలేదని టాక్ వినిపిస్తోంది. ఎందుకంటే గ్రాటిట్యూడ్ ఈవెంట్ లో నిర్మాతలు, బయ్యర్లు బిజినెస్ రహస్యాలు బయట పెట్టారనే చెప్పాలి. దీంతో చాలా మంది అన్నీ ఇలా స్టేజ్ ల మీద బయటపెట్టేస్తారా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. అలా కరెక్ట్ కాదేమోనని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి డిస్ట్రిబ్యూటర్ల హ్యాపీ మీట్ పై అంతా చిర్రుబుర్రు లాడుతున్నట్టు అర్థమవుతోంది.

## అంజలి.. ట్రెడిషినల్ టచ్ తో స్టన్నింగ్ గ్లామర్ డోస్

సౌందర్యానికి, అభినయానికి నెలవైన అంజలి.. తెలుగు, తమిళ సినీప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి. సహజమైన నటనతో ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఆమె, 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' లాంటి సినిమాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. తమిళంలో కెరీర్ ప్రారంభించినా, తెలుగులోనూ తనకంటూ మంచి స్థానం ఏర్పరుచుకుంది. సాఫ్ట్ లుక్స్‌లోనూ, మాస్ అవతారంలోనూ ఆకట్టుకునే తారగా అంజలి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఆమె వరుస సినిమాల్లో కనిపించకపోయినా, మంచి కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూ ముందుకు వెళ్తోంది. 'గేమ్ ఛేంజర్'లో కీలక పాత్రలో కనిపించిన ఆమె, 'గాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాతో మరోసారి తన ప్రతిభను చూపించింది. వెబ్ సిరీస్‌ల ద్వారా కూడా



ప్రేక్షకులకు చేరువవుతున్న అంజలి, కథానాయికగా తన ప్రత్యేకతను నిరూపించుకుంటోంది. తాజాగా అంజలి ట్రెడిషనల్ లుక్‌లో చేసిన ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లైట్ పింక్ శారీలో ఆమె అందాన్ని ఇంకాస్త హైలైట్ చేసేలా ఉన్న ఈ ఫోటోలు, అందరికీ కనువిందు చేస్తున్నాయి. ఆమె చూపులతోనే తన అందాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. సింపుల్ స్టైలింగ్, మినిమల్ జ్యువెల్రీతో మరింత గ్రేస్‌ఫుల్‌గా కనిపించింది. ఇప్పటికే అనేక ప్రయోగాత్మక సినిమాలు చేసిన అంజలి, ప్రస్తుతం మంచి అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. ఇటీవల పెద్దగా అవకాశాలు రాకపోయినా, 'మ్యాడ్ 2' సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ చేయబోతోందని సమాచారం. మరీ, ఈ అందమైన తారకు మళ్లీ పెద్ద సినిమాల్లో అగ్రహీరోలతో అవకాశాలు వస్తాయా? అనేది చూడాలి. ఇక ఇటీవల మధగధరాజా సినిమాతో టాలీవుడ్ లో మంచి హిట్ అందుకున్న అంజలి ప్రస్తుతం మరికొన్ని డిఫరెంట్ సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తోంది.

## అవకాశాల కోసం రెండేళ్ల పాటూ ఆఫీసుల చుట్టూ తిరిగా: నిధి అగర్వాల్

టాలీవుడ్ ఆడియన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న సినిమాలు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేస్తున్న హర్రర్ కామెడీ ది రాజా సాబ్. ఈ రెండు సినిమాల్లోనూ హీరోయిన్ గా నటించే అవకాశం అందుకుంది లక్కీ గర్ల్ నిధి అగర్వాల్. ఈ రెండు సినిమాలూ పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతున్నవే. అయితే నిధి అంత ఈజీగా హీరోయిన్ అయిపోలేదట. చిన్నప్పటి నుంచి తనకు సినిమాలంటే ఇష్టముండటంతో అప్పటినుంచే సినిమాలు ఎక్కువగా చూసేదట. దీపికా పదుకొణెను చూసి తాను కూడా సినిమాల్లో నటించాలనుకుందట నిధి. అయితే ఆ విషయాన్ని ఇంట్లో చెప్తే ముందు చదువుకో, తర్వాత సినిమాల గురించి ఆలోచించొచ్చాన్నారట. చదువు అయిపోయాక నిధిని తన తండ్రి బిజినెస్ లో భాగం చేయాలనుకున్నాడట. కానీ తనకు హీరోయిన్ అవాలని ఉండటంతో ఆ దిశగా తన తండ్రి ఆమెను ప్రోత్సహించినట్టు నిధి తెలిపింది. చదువయ్యాక ముంబై వెళ్లి సినీ అవకాశాల కోసం ట్రై చేసిన నిధి, ఫోటోలు పట్టుకుని ఎన్నో ఆఫీసుల చుట్టూ తిరిగినట్టు వెల్లడించింది. ఛాన్సులు ఇవ్వకపోయినా కొంతమంది పదేపదే తనను



తిప్పించుకున్నారని నిధి ఈ సందర్భంగా చెప్పింది. రెండేళ్లు ఇబ్బందుల తర్వాత మూడొందల మందిని ఆడిషన్ చేసి చివరకు తనను మున్నా మైఖేల్ కోసం సెలెక్ట్ చేశారని, అలా హీరోయిన్ గా మొదటి ఛాన్స్ అందుకున్నానని, ఆ సినిమా చూసి సవ్యసాచిలో అవకాశమొచ్చి తర్వాత టాలీవుడ్ లో సెటిలైపోయినట్టు చెప్పుకొచ్చింది నిధి. కానీ ఉన్నట్టుండి నిధి నుంచి సినిమాలు తగ్గిపోయాయి. దానికి కారణం పవన్ తో చేస్తున్న హరిహర వీరమల్లుకు ఆమె అగ్రిమెంట్ చేయడమే. ఆ సినిమాలో నటించినంత కాలం మరే సినిమాకూ పని చేయకూడదని నిధి సైన్ చేసిందట. తర్వాత వీరమల్లు వాయిదా పడిన టైమ్ లో ప్రభాస్ సినిమా ఛాన్స్ వచ్చిందని, వీరమల్లు టీమ్ ను అడిగి రాజా సాబ్ సినిమాను ఓకే చేసినట్టు నిధి తెలిపింది. హరిహర వీరమల్లు సినిమా లో తాను వీరమల్లు ప్రేయసి పంచమి పాత్రలో కనిపించనున్నట్టు తెలిపిన నిధి, ఆ సినిమాలో యువరాణిగా కొన్ని యుద్ధాలు కూడా చేసినట్టు వెల్లడించింది. ఇక ప్రభాస్ తో నటిస్తున్న రాజా సాబ్ సినిమాలో తన పాత్ర చాలా కొత్తగా ఉంటుందని, రాజా సాబ్ లో తన పాత్ర అందరూ తనని చూసే దృష్టిని మారుస్తుందని, హారర్ సినిమాలంటే భయపడే వాళ్లు రాజా సాబ్ ను తల్లిదండ్రులతో కలిసే చూడమని సలహా ఇచ్చింది నిధి. ఇక తనకు మణిరత్నం డైరెక్షన్ లో వచ్చిన సఖి సినిమా అంటే ఎంతో ఇష్టమని ఆ సినిమాను ఎన్ని సార్లు చూశానో లెక్క కూడా లేదని నిధి తెలిపింది.




హైదరాబాద్: కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు.

భారాస నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. "కులగణన సర్వే 50 రోజులు జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ భాజపా ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు" అని అన్నారు.

**గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు భయటపెట్టలేదు?...**"గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు భయటపెట్టలేదు? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జనగణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వదిలేశారు. బలహీనవర్గాలకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదు" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.




హైదరాబాద్ : ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలంటూ ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఈ వ్యవహారం ముందుకు జరగలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీంలో పిటిషన్ వేసింది. మొదట తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పిటిషన్ వేసింది.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం.. ఆ అధికారికి శాపంగా మారింది




హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం 8000 మంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఈ పోలీస్ అధికారి ఆవేదన చూస్తే హృదయం కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 30 ఏళ్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించిన ఠాగూర్ నారాయణ సింగ్ ఇలాంటి పరిస్థితుల్లో ఉండటం చాలా బాధాకరమని హరీశ్‌రావు వాపోయారు. ఒకవైపు ఆ అధికారి రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మరోవైపు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డుతో చికిత్స చేయించుకుందామని ఆస్పత్రికి వెళ్తే ఆ కార్డు చెల్లదని పంపిస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఈ విశ్రాంత పోలీసు ఉద్యోగికి శాపంగా మారిందని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఒక నారాయణ సింగ్ సమస్య కాదని.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ అయిన 8000 మంది ప్రభుత్వ ఉద్యోగుల జీవన్మరణ సమస్య అని చెప్పారు. రేవంత్ రెడ్డికి ఉద్యోగుల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్న వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వైద్యసేవలు పొందడంలో అంతరాయం కలగకుండా ఈహెచ్‌ఎస్, పోలీస్ ఆరోగ్య భద్రత కార్డులు ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.




హైదరాబాద్: సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాల్లో సుమారు 2 గంటలపాటు క్యాబినెట్ భేటీ కొనసాగింది. ఈ నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలపనున్నారు. క్యాబినెట్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "దేశంలో మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించాం. పకడ్బందీగా సర్వేచేసి సమాచారం సేకరించాం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నాం. కులగణన విషయంలో ప్రధానిపైనా ఒత్తిడి పెరుగుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉప సంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకెళ్తాం. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా! ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదు" అని వ్యాఖ్యానించారు.

## ఎన్నికల సమయంలోనే బీసీలు గుర్తుకు వస్తున్నారు: భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కులగణన సర్వేపై వాడివేడి చర్చ జరిగింది. కులగణన సర్వే నివేదికలో పొందుపర్చిన అంశాలపై భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్, భారాస ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలకు బీసీలు గుర్తుకు వస్తున్నారని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఓట్లు పొందేందుకే బీసీ నినాదం అందుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు, రాష్ట్ర జనాభా సంఖ్యకు పొంతన లేదన్నారు. "ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 4.33 కోట్లు అని తెలుస్తోంది. కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.76 కోట్లుగా తెలుస్తోంది. టికెట్ల కేటాయింపు దగ్గర నుంచే బీసీలకు అన్యాయం జరుగుతోంది. జనాభా ప్రకారం బీసీలకు సగం సీట్లు ఇస్తామని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. గెలుపు అవకాశాలు లేని స్థానాలకు బీసీలను పరిమితం చేస్తున్నారు. కులసంఘాల భవనాలకు స్థలం కేటాయింపులోనూ బీసీలకు అన్యాయం జరుగుతోంది. హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో బీసీ సంఘాల భవనాలకు స్థలం కేటాయిస్తున్నారు. అగ్రవర్ణాల వారి కులసంఘాల భవనాలకు మాత్రం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో కేటాయించారు. బలహీనవర్గాల విషయంలో కేవలం తీర్మానాలు చేసి వదిలేస్తున్నారు. ఈ సర్వేలో హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని కొత్త పదాలు సృష్టించారు. కోర్టుల్లో కేసులు వేసి బీసీలకు రిజర్వేషన్ల పెంపును జాప్యం చేయాలని చూస్తున్నారు. కోర్టుల పేరు చెప్పి ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల పెంపును పక్కకు పెడుతోంది" అని ఆరోపించారు.




## వారిని వెంటనే పంపేయండి: అస్సాం ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

దిల్లీ: అస్సాం ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపివేయకుండా నిర్బంధ కేంద్రాల్లో నిరవధికంగా ఉంచడంపై మండిపడింది. వారిని స్వస్థలాలకు పంపడానికి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారా అని ప్రశ్నించింది. నిర్బంధ కేంద్రాల్లో ఉంచిన 63 మందిని రెండు వారాల్లోగా పంపించేయాలని న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఎవరైనా దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారని తెలిసినప్పుడు వారిని పంపివేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. నిర్బంధంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపించమంటే వారి చిరునామా తెలియదని పేర్కొంటూ మీరు తరలింపు ప్రక్రియను ప్రారంభించడానికి నిరాకరిస్తున్నారు. అది మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశంకాదు. అలాగే వారిని జీవితాంతం కేంద్రాల్లో ఉంచి పోషించలేం కదా..వెంటనే వారిని వారి దేశాలకు తరలించండి. దానికి ఏమైనా ముహూర్తంకోసం ఎదురుచూస్తున్నారా..?" అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అస్సాంలో ఉన్న అన్ని నిర్బంధ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఎంతమందిని వారి దేశాలకు పంపించారన్న నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. అస్సాం సహా మరికొన్ని రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు పెద్దయెత్తున పెరిగిపోవడంతో స్థానికుల్లో అభద్రతాభావం అధికమవుతోంది. తమ వనరులు పొరుగు దేశస్థుల పాలవుతున్నాయని... తాము మైనారిటీలుగా మారే ముప్పుందని వారు వాపోతున్నారు. వలసదారుల్లో కొందరు మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రతకు ముప్పుగానూ పరిణమిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న వారిని తమ దేశాలకు పంపడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం పైవిధంగా స్పందించింది.




## భారీ లాభాల్లో సూచీలు.. 23,600 ఎగువన నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. కెనడా, మెక్సికో దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. వాణిజ్య యుద్ధ భయాలు రేపిన ట్రంప్ నుంచే ఓ సానుకూల నిర్ణయం వెలువడటంతో ఆసియాతో పాటు మన మార్కెట్ సూచీలూ భారీ లాభాల్లో కొనసాగడానికి ప్రధాన కారణమైంది.

సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 23,600 పాయింట్ల మార్కును దాటింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో సెన్సెక్స్ 1155 పాయింట్లు లాభంతో 78,342 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 324 పాయింట్లు పెరిగి 23,685 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్‌అండ్‌టీ, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ లాభాల్లో కొనసాగుతుండగా.. జొమాటో, ఐటీసీ హోటల్స్, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

**కారణాలు ఇవీ..** మెక్సికో, కెనడాపై సుంకాల విషయంలో ట్రంప్ తన నిర్ణయాన్ని వాయిదా వేయడం సూచీల లాభాలకు కారణమైంది. దీంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ లాభాల్లో కొనసాగుతున్నాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ బలపడడం కూడా మరో కారణం. ఆల్‌టైమ్ కనిష్ఠం నుంచి మన రూపాయి 13 పైసల మేర కోలుకుంది. ప్రస్తుతం 86.98 వద్ద కొనసాగుతోంది. రేట్ల కోతపై ఆర్‌బీఐ నుంచి సానుకూల సంకేతం వస్తుందన్న అంచనాలతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కూడా సూచీల ర్యాలీకి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణానికి భూమి కేటాయింపు..!



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ డిసెంబర్‌లో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన స్మారకం ఏర్పాటు కోసం కేంద్రం భూమి కేటాయించిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ఇచ్చిన స్థలం పక్కనే ఉన్న ఈ భూమిని సింగ్ కుటుంబ సభ్యులకు ఇచ్చిందని పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ కోసం సింగ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయనున్న ట్రస్ట్ కోసం ప్రభుత్వం వేచి చూస్తోందని మీడియా కథనాలు తెలిపాయి. ఒకసారి అది ఏర్పాటైన తర్వాత ఆ స్థలాన్ని అప్పగించనుంది. అంతేగాకుండా నిర్మాణం నిమిత్తం రూ.25 లక్షలు ఇవ్వనుంది.

దిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలోని రాష్ట్రీయ సమితి కాంప్లెక్స్‌లో ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ విషయాన్ని గత నెల ఆయన కుమార్తె శర్మిష్ఠముఖర్జీ ధ్రువీకరించారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తీన్మార్ మల్లన్నకు షాక్.. డీజీపీకి ఫిర్యాదు చేసిన రెడ్డి సంఘం నేతలు..



హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘాల నేతలు మండిపడుతున్నారు. తమ కులాన్ని దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఫిబ్రవరి 28న వరంగల్ వేదికగా బీసీ సభను తీన్మార్ మల్లన్న నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన రెడ్డి కులంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని, కుక్కలతో పోలుస్తూ దూషించారని ఆరోపణలు వస్తున్నాయి. మల్లన్న వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెడ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి కులాన్ని కించపరిచేలా దూషించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే హైదరాబాద్ ఉప్పల్ పోలీసులకు రెడ్డి మహిళా సంఘం నేతలు ఫిర్యాదు చేయగా.. నేడు(మంగళవారం) డీజీపీ జితేందర్ రెడ్డిని కలిసిన రెడ్డి సంఘం నేతలు మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రెడ్డి కులానికి మల్లన్న క్షమాపణలు చెప్పాలని, చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రెడ్డి సంఘాల నేతలు తీన్మార్ మల్లన్నపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలు ఫిర్యాదుకు వెళ్తే.. 'ఆత్మహత్య' బెదిరింపులు: మస్తాన్ సాయి కేసులో కొత్త కోణాలు

హైదరాబాద్: యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన ఏపీకి చెందిన రావి మస్తాన్ సాయి కేసు లో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధిత మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తుంటే బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఫ్యాన్‌కి ఉరి బిగించుకుని ఏడుస్తూ వీడియో కాల్స్ చేసినట్లు సమాచారం. సుమారు 100 మందికి పైగా మహిళలను ఇలా మోసగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రికార్డ్ చేసిన వీడియోలతో బ్లాక్ మెయిల్ చేసి పలుమార్లు అత్యాచారం చేసినట్లు దర్యాప్తులో తేల్చారు. యువతులను మస్తాన్ సాయి అసభ్యంగా తిడుతూ మానసిక క్షోభకి గురిచేసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో నిందితుడిని మరోసారి కస్టడీకి తీసుకొని విచారణ చేయనున్నారు. మస్తాన్ సాయి బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. యువతులు, వివాహితలకు డ్రగ్స్ ఇచ్చి, లైంగికవాంఛ తీర్చుకుంటూ వీడియోలను చిత్రీకరిస్తున్నాడని విజయవాడకు చెందిన మన్నేపల్లి లావణ్య(32) ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి ఠాణాలో కేసు నమోదైన విషయం తెలిసిందే. మస్తాన్‌సాయి గతంలో హైదరాబాద్, విజయవాడలో నమోదైన డ్రగ్స్ కేసుల్లో నిందితుడు. సినీ నటుడు రాజ్‌తరుణ్ తనను పెళ్లి పేరిట మోసగించాడని లావణ్య గతంలో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంలోనే మస్తాన్‌సాయి వ్యవహారం బయటకొచ్చింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com